



కమ్మేసిన పొగమంచు

- ఏజెన్సీని తలపించిన మైదాన ప్రాంతం
- ఉదయం 9 గంటల వరకు వీడని మంచు తెరలు

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పొగమంచు దట్టంగా కమ్మేసింది. శివారు ప్రాంతాల్లో వర్షం మాదిరిగా మంచు కురిసింది. ఏజెన్సీని తలపించే రీతిలో మైదాన ప్రాంతాన్ని పొగమంచు ముంచేసింది. కొన్నిచోట్ల 30 మీటర్లకు పైబడి దూరంలో వున్నవి ఏవీ కనిపించనంతగా పరిస్థితి వుంది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దీనికితోడు చలి తీవ్రత బాగా పెరిగింది. వివిధ పనులు, ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం ఉదయాన్నే బయటకు వెళ్లాల్సిన వారు చలితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. అనకాపల్లి స్టేషన్‌కు పలు రైళ్లు ఆలస్యంగా వచ్చాయి. ప్రస్తుత శీతాకాలంలో ఇంత భారీగా మంచుకురవడం ఇదే ప్రథమమని పలువురు అంటున్నారు.

అనకాపల్లిలో శారదా బ్రిడ్జిపై లైట్లు వేసుకొని వెళుతున్న వాహనాలు

నేడు గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

- అట్టహాసంగా ఏర్పాట్లు
- శోభాయమానంగా ఆలయం, పరిసరాలు అలంకరణ
- పలుచోట్ల భారీ విద్యుత్ సెట్టింగులు
- సాంస్కృతిక ప్రదర్శనలకు 36 వేదికలు

అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఊరేగింపు ప్రారంభం అవుతుంది. రాత్రి సాంస్కృతిక ప్రదర్శన కోసం 36 వేదికలను ఏర్పాటు చేశారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల కారణంగా శనివారం విశాఖపట్నం, విజయనగరం వైపు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులను వేరే మార్గాల్లోకి మళ్లించారు.

-వివరాలు 8వ పేజీలో





గవరపాలెం సతకంపట్టులో గౌరీ పరమేశ్వరుల ఆలయం (ఇన్‌సెట్‌లో) కొలువుదీరిన గౌరీ పరమేశ్వరులు

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు?

- భవన నిర్మాణాలకు అనుమతుల మంజూరులో అక్రమాలు
- రెండున్నరేళ్ల క్రితం అందిన ఫిర్యాదులపై స్పందించిన ఏసీబీ అధికారులు
- జోన్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ
- క్షేత్రస్థాయిలో పలు భవనాల పరిశీలన
- మునిసిపల్ పరిపాలన శాఖకు నివేదిక
- క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్‌లో గతంలో విధులు నిర్వహించినప్పుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు అధికారులు, ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. వీరిలో ... మిగతా 8వ పేజీలో

త్రిశంకు స్వర్గంలో తాండవ షుగర్స్

హామీని అమలు చేయని వైసీపీ అధినేత

- ఆర్థికంగా ఆదుకోకపోవడంతో ఆ పార్టీ హయాంలోనే మూసివేత
- ఇప్పటికే నాలుగు సీజన్లు పూర్తి
- పాడైపోతున్న యంత్ర సామగ్రి
- కార్మికులకు రూ.13.5 కోట్ల బకాయిలు
- ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని యువగళంలో నారా లోకేశ్ హామీ
- కూటమి ప్రభుత్వంపైనే రైతులు, కార్మికుల ఆశలు
- వచ్చే సీజన్ నాటికి అందుబాటులోకి తేవాలని వినతి

పాయకరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

రెండు జిల్లాల చెరకు రైతులకు ఆరు దశాబ్దాలపాటు జీవనాడిగా వున్న తాండవ షుగర్స్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వివిధ కారణాల వల్ల ఆర్థిక ఇబ్బందులకు గురైన తాండవ షుగర్ ఫ్యాక్టరీకి గత వైసీపీ ప్రభుత్వం చేయూత ఇవ్వకపోగా, పూర్తిగా మూసివేయించింది. వేలాది మంది చెరకు రైతులు గత్యంతరం లేక అరకొర ఆదాయం వచ్చే ఇతర పంటలను సాగు చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, తాండవ షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తారని రైతులు ఆశిస్తున్నారు.



ఫ్యాక్టరీ లోపల ప్రస్తుత పరిస్థితి

పాయకరావుపేటలో 1962లో 'తాండవ సహకార చక్కెర కర్మాగారం' పేరుతో ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. పదిహేనేళ్ల తరువాత ఆధునికీకరణ పనులు చేపట్టి రోజు వారీ క్రషింగ్ సామర్థ్యాన్ని 1,250 టన్నులకు, మళ్లీ 2001లో 1,600 టన్నులకు పెంచారు. పాయకరావుపేట, నర్సీపట్నంతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన సుమారు 12 వేల మంది సభ్యరైతులు వున్నారు. 2010వ సంవత్సరం వరకు ఫ్యాక్టరీ సవ్యంగానే నడిచింది. ఆ తరువాత నుంచి పంచదార ఉత్పత్తి వ్యయం కన్నా మార్కెట్‌లో పంచదార అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా వుండడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఏటేటా నష్టాలు పెరుగుతూ వచ్చాయి. ఇదే సమయంలో పంచదార విక్రయాలపై కేంద్రం ఆంక్షలు విధించడంతో మార్కెట్‌లో పంచదార ధర పెరిగినపుడు అమ్ముకునే వీలులేకపోయింది. దీంతో చెరకు రైతులకు పేమెంట్లు, కార్మికుల వేతనాల చెల్లింపుల కోసం పంచదారను బ్యాంకులకు తనఖా పెట్టి అప్పులు చేయాల్సి వచ్చింది. రానురాను పరిస్థితి మరింత దిగజారిపోయి ఆర్థిక సంస్థల నుంచి అప్పులు పుట్టే పరిస్థితి లేకపోయింది.

వైసీపీ హయాంలో మూసివేత

ఈ నేపథ్యంలో 2019 సాధారణ ఎన్నికలు వచ్చాయి. తాము అధికారంలోకి వస్తే సహకార రంగంలోని చక్కెర కర్మాగారాలను ఆర్థికంగా ఆదుకుని అభివృద్ధికి కృషిచేస్తామని పాదయాత్ర సందర్భంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత సహకార ... మిగతా 8వ పేజీలో



నిర్మానుష్యంగా ఉన్న ఫ్యాక్టరీ ఆవరణ

మందకొడిగా బాల ఆధార్

ప్రత్యేక శిబిరాలపై కొరవడిన ప్రచారం

- 0-6 ఏళ్ల లోపువారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో గత అక్టోబరునాటికి 1,22,941 మందికి ఆధార్ లేదని గుర్తింపు
- జనవరి పదో తేదీకి 17,283 మందికి మాత్రమే నమోదు
- ఆధార్ చేయించుకోని చిన్నారులు 1,05,658 మంది
- వీరిలో 24,598 మంది అనకాపల్లి జిల్లా పిల్లలు
- ఈ నెలాఖరు వరకు ప్రత్యేక శిబిరాలు
- శత శతం నమోదుకు ప్రయత్నాలు

రోలుగుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల ఆధార్ నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. ప్రతి నెల చివరి ఆరు రోజులు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఆశించినంత స్పందన ఉండడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరేళ్ల లోపు పిల్లల్లో ఇంకా లక్ష పైచిలుకు మంది చిన్నారులకు ఆధార్ నమోదు కాలేదు. ఇందులో మూడో వంతు మంది అనకాపల్లి జిల్లాలో వున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఏ సంక్షేమ పథకం పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ఏడాది అక్టోబరు నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలపై దృష్టిపెట్టింది. బిడ్డ పుట్టిన వెంటనే ఆధార్ నమోదు చేసేలా చర్యలు చేపట్టింది. ఆ సమయానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో 0-6 ఏళ్ల లోపు ఆధార్ లేని పిల్లలు 1,22,941 మంది వున్నట్టు గుర్తించారు. వీరిలో 72,529 ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే వున్నారు. అనకాపల్లి జిల్లాలో 31,422 మంది, విశాఖ జిల్లాలో 18,990 మంది పిల్లలు ఉన్నారు. గత ఏడాది నవంబరు ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది జనవరి పదో తేదీ వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రత్యేక శిబిరాల ద్వారా 17,283 మంది (ఆరేళ్ల లోపు) పిల్లలకు మాత్రమే ఆధార్ నమోదు చేశారు. జనవరి 11వ తేదీనాటికి అల్లూరి జిల్లాలో 68,095, అనకాపల్లి జిల్లాలో 24,598 మంది, విశాఖ జిల్లాలో 12,965 మంది.. మొత్తం 1,05,658 మంది పిల్లలకు ఆధార్ నమోదు కాలేదు.

ప్రచార లోపమే కారణం

ప్రత్యేక ఆధార్ శిబిరాల ఏర్పాటుపై ప్రచారం లేకపోవడం వల్లనే నమోదుకు స్పందన అరకొరగా వుంటున్నది. ఆధార్ నమోదు శిబిరాల గురించి గ్రామ/వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది తమ పరిధిలో ఆరేళ్ల లోపు పిల్లలు వున్న ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులకు తెలియపరచాలి. కానీ క్షేత్రస్థాయిలో ప్రచారం చేయకపోవడంతో ప్రత్యేక ఆధార్ నమోదు గురించి చాలా మందికి తెలియడంలేదు. దీంతో సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసే ఆధార్ నమోదు శిబిరాలు వెలవెలబోతున్నాయి.



గొలుగొండ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

శత శాతం నమోదుకు చర్యలు


జిల్లాలో ఆరేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదుకు 56 గ్రామ సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక శిబిరాల ద్వారా శత శాతం ఆధార్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఆధార్ నమోదును పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను కూడా నియమించాం.

- అనంతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, అనకాపల్లి జిల్లా

వైసీపీలో కలకలం

పార్టీ విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటనతో నేతలు, కార్యకర్తల్లో విస్మయం

- వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం ఆయనదే పెత్తనం
- ఆరోపణలు అనేకం



విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):

రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటన వైసీపీని కుదిపేస్తోంది. పార్టీలో నంబరు-2 వ్యవహరిస్తూ ఢిల్లీలో చక్రం తిప్పిన సాయిరెడ్డి రాజకీయాలకు గుడ్‌బై చెబుతున్నానని శుక్రవారం చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్రచర్చకు దారితీసింది. నిజంగా రాజీనామానా?, లేక తెర వెనుక ఏమైనా డ్రామా ఉందా?...అని పలువురు సంశయం వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ పోర్టు లావాదేవీల్లో విజయసాయి రెడ్డి వియ్యంకుడి కంపెనీ అయిన అరబిందో ఫార్మా పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోవడం, అది అటు తిరిగి..ఇటు తిరిగి పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మెడకు చుట్టుకునే అవకాశం ఉండడంతో ఏకంగా పార్టీ నుంచి బయటకు వచ్చేశారని ప్రచారం జరుగుతోంది.

విశాఖలో ఆయన చెప్పిందే వేదం


వైసీపీ అధికారంలోకి రాక ముందే విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యతలు తలకెత్తుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో ఆయన చెప్పిందే వేదం అన్నట్టుగా సాగింది. మంత్రులు ఉన్నా వారికి ఎటువంటి విలువ దక్కలేదు. విశాఖలో జగన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేసి, కేసులు పెట్టి వేధించారు. దసపల్లా భూములను ప్రభుత్వ జాబితా నుంచి తప్పించారు. విశాఖ-భోగాపురం కోస్టల్ కారిడార్‌ను దారిమళ్లించారు. భీమిలి ప్రాంతంలో యజమానుల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా భూములను కొనుక్కున్నారు. సింహాచలం దేవస్థానం చైర్మన్ అశోక్‌గజపతిరాజును పక్కనపెట్టి ఆయన సోదరుడు ఆనంద గజపతి కుమార్తె సంచయితను ఢిల్లీ నుంచి తీసుకువచ్చి చైర్‌పర్సన్‌ను చేసి ఆ కుటుంబంలో చిచ్చు పెట్టారు. చాలా మందిని భయపెట్టి పార్టీ మారేలా చేశారు.

2024 ఎన్నికలకు ఏడాది ముందు సాయిరెడ్డిని ఇక్కడి నుంచి తప్పించి వైవీ సుబ్బారెడ్డిని ఇన్‌చార్జిగా వేశారు. పార్టీ ఓడిపోవడంతో సాయిరెడ్డికి జగన్ మళ్లీ విశాఖ జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఈ మధ్య రెండు, మూడుసార్లు నగరానికి వచ్చి పార్టీ సమావేశాలు నిర్వహించారు. ఆయనతో నాటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ జీవీ వంటి వారికి పొసిగేది కాదు. ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వస్తే భగ్గుమనేది. ఇదిలావుండగా పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరు బయటకు వెళ్లిపోతుండడంతో నాయకులు, కార్యకర్తలు కలవరపడుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనందకుమార్‌లు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే..

కల్లు గీత కులాలకు మద్యం దుకాణాలు

లాటరీ ద్వారా కేటాయింపు

- శెట్టిబలిజ-9, యాత-4, గౌడ-1, గౌడ్-1
- ఐదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ
- ఏడో తేదీన లాటరీ ద్వారా ఎంపిక



లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తున్న అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కల్లు గీత కులాలకు జనాభా దామాషా పద్ధతిలో లాటరీ ప్రక్రియ ద్వారా 15 మద్యం దుకాణాలను కేటాయించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కల్లు గీత ఉప కులాల నాయకుల ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2024-26 ఆబ్కారీ సంవత్సరానికి సంబంధించి మద్యం షాపులను లాటరీ ద్వారా పారదర్శక

... మిగతా 8వ పేజీలో

205 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురు నిందితుల అరెస్టు

అనకాపల్లి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీ వైపు నుంచి మైదాన ప్రాంతం మీదుగా 205 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చింతపల్లి వైపు నుంచి నర్సీపట్నం వైపు గంజాయి రవాణా అవుతున్నట్టు శుక్రవారం ఉదయం నర్సీపట్నం రూరల్ పోలీసులకు సమాచారం వచ్చిందని చెప్పారు. దీంతో నర్సీపట్నం శివారులో వాహనాల తనిఖీ చేపట్టారని, ఈ క్రమంలో ఒక టీవీ న్యూస్ ఛానెల్ (ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కాదు) స్టిక్కర్‌తో ఉన్న కారు, దాని వెనుక వస్తున్న మోటార్ బైక్‌ను పోలీసులు ఆపారని చెప్పారు. దీంతో వాహనాల్లో వున్న ముగ్గురు వ్యక్తులు కిందకు దిగి పారిపోవడానికి యత్నించగా పోలీసులు పట్టుకున్నారని ఎస్పీ తెలిపారు. కేరళకు చెందిన అజిత్ కంగ్‌రాజన్, అమల్‌సురేశ్, అల్లూరి జిల్లాకు చెందిన మర్రి సత్తిబాబులను అదుపులోకి తీసుకున్నారని, కారులో తనిఖీ చేయగా 205 కిలోల గంజాయి లభించిందన్నారు. దీంతోపాటు రూ.1,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలతోపాటు నగదు రివార్డును అందజేశారు.



పట్టుబడిన గంజాయితోపాటు నిందితులతో ఎస్పీ తుహిన్‌సిన్హా, పోలీసు అధికారులు

బడి పిల్లలను తరలించే సమయాల్లో అప్రమత్తత అవసరం

» వాహనాల డ్రైవర్ల అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ



డ్రైవర్ల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

ఎలమంచిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు విద్యార్థులను తరలించే వాహనాల డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో శుక్రవారం డ్రైవర్లకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకు వెళ్లే వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ ఫోన్‌లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఆటోలు, బస్సుల డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలి : ఐద్వా



అచ్యుతాపురంలో సంతకాలు సేకరిస్తున్న ప్రతినిధులు

అచ్యుతాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి, ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్యుతాపురంలో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించి సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌ను డిపోల ద్వారా పదహారు రకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనువుగా జీతాలు లేకపోవడంతో సామాన్య, మధ్య తరగతికి చెందినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. ఐద్వా ప్రతినిధులు ఆర్. లక్ష్మి, మంగతాయారు, మంగమ్మ, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పశువుల ఆరోగ్య పరిరక్షణకే ప్రత్యేక శిబిరాలు'


మూలజంపలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలజంప గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వేగిరాము, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం పలు పశువులకు పంచదార్ల పశువైద్యాధికారిణి మాధురి బృందం వైద్య పరీక్షలు జరిపి, ఆయా రైతులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో..

» వాతావరణంలో మార్పు కారణంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇదే పరిస్థితి
» ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించని దుస్థితి
» లైట్లు వేసుకుని వాహనాల రాకపోకలు
» సెజ్‌కు విధులకు వెళ్లే వారి అవస్థలు వర్ణనాతీతం


వెంకటాపురం నుంచి రాంబిల్లి వెళ్లే రోడ్డులో కురుస్తున్న పొగమంచులో వాహనాల వెలుతురులో రాకపోకలు

ఎలమంచిలి/అచ్యుతాపురం/రాంబిల్లి/ మునగపాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని నాలుగు మండలాలను శుక్రవారం పొగ మంచు కమ్మేసింది. ఈ కారణంగా తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఉదయం ఎనిమిన్నర గంటల వరకు ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు. దీనికితోడు చలి గాలులు వీస్తుండడం మరిన్ని అవస్థలకు కారణమవుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు గజగజ వణికిపోతున్నారు. పొగ మంచు కారణంగా మామిడి, జీడిమామిడికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయా రైతులు చెపుతున్నారు. పూతపై ఈ ప్రభావం చూపుతుందని అంటున్నారు. ఇదిలావుంటే, అచ్యుతాపురం సెజ్‌లోని కర్మాగారాలకు ఉద్యోగులు, కార్మికులను తీసుకు వెళ్లేందుకు ఉదయం ఐదు గంటల నుంచి అచ్యుతాపురం జంక్షన్ మీదుగా వందల సంఖ్యలో బస్సులు, ఇతర వాహనాలు వెళుతుంటాయి. ఆ సమయంలో ఆయా డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొన్నారు. మండల కేంద్రమైన అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో జరిగే వారపు సంతలకు తెల్ల వారు జామున రైతులు కూరగాయలు తెచ్చేవారు. కానీ మంచు వల్ల శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు వారు సైతం కనిపించలేదు. తొమ్మిది గంటల వరకు పలు రోడ్లు బోసిపోయి కనిపించాయి. ఆ తరువాత మంచు తెరలు వీడడంతో సందడి ఆరంభమైంది.


అచ్యుతాపురంలో...


ఎలమంచిలిలో...

వాతావరణ మార్పులు.. సుస్థిర వ్యవసాయ శిక్షణకు ప్రసాద్ ఎంపిక



అచ్యుతాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'వాతావరణ మార్పులు, సుస్థిర వ్యవసాయం' అంశంపై జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ నిర్వహించే శిక్షణ తరగతులకు అచ్యుతాపురంలోని ప్రశాంతి విద్యా సంస్థల ఛైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఈనెల 29 నుంచి రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జరగనున్న ఈ తరగతు లకు దేశవ్యాప్తంగా 30 మంది నిపుణులు హాజరు కానున్నారు. ఇందులో ప్రసాద్ ఒకరు కావడంపట్ల స్థానిక నాయకులు, విద్యా సంస్థల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

బెల్లం తయారీపై రైతులకు శిక్షణ


క్రషింగ్‌ను వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

మునగపాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బెల్లం తయారీ, విక్రయాలు తదితర అంశాలపై అవగాహన పొందేందుకు ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ జిల్లాకు చెందిన చెరకు రైతుల బృందం శుక్రవారం మండలంలోని తిమ్మరాజుపేటకు విచ్చేశారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త దాడి ఉమా మహేశ్వరరావు సారథ్యంలో అభ్యుదయ చెరకు రైతుగా గుర్తింపు పొందిన సూరిశెట్టి మునిలినాయుడును కలిశారు. ఇక్కడ చెరకు క్రషింగ్ మొదలు, బెల్లం తయారీ, దానిని అచ్చులు, దిమ్మలు రూపంలో వేయడం వంటి వాటిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త ఎం.చంద్రశేఖరెడ్డి, ఒడిశా రాష్ట్ర వ్యవసాయాధికారి ప్రణయ్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సమావేశానికి మంత్రి అనితకు ఆహ్వానం



అచ్యుతాపురం/ఎలమంచిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : హోం మంత్రి వంగల పూడి అనితను ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం కలిశారు. విశాఖలోని ఆమె నివాసానికి వెళ్లి ఎలమంచిలి నియోజకవర్గంలో ఏర్పాటు చేసే టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పినట్టు ప్రగడ ఇక్కడి విలేకరులకు వివరించారు.

ఇంటర్వ్యూ..

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- డి.సీతారామరాజు, ఎంపీడీవో



మండల ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇందులో భాగంగా పారిశుధ్య పనులపై దృష్టి సారించాం. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించనున్నాం.

ప్రశ్న : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.. చర్యలేమిటి ?

జవాబు : మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో శానిటేషన్ పనులు చేపట్టాలని ఆదేశించాం. ఎప్పటికప్పుడు ఈ పనులను పరిశీలిస్తున్నాం.

ప్రశ్న : వేసవి సమీపిస్తుంది. నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలేమిటి?

జవాబు : ఈ వేసవిలో మంచినీటి ఇబ్బందుల్లేకుండాచర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారు. త్వరలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించి, నీటి ఎద్దడి నివార ణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తాం. ముందుగా నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించే పనిలో ఉన్నాం.

ప్రశ్న : సంపద కేంద్రాలు ఎలా పనిచేస్తున్నాయి?

జవాబు : మండలంలో 24 సంపద కేంద్రాలున్నాయి. వీటిలో 18 కేంద్రాలు పని చేస్తున్నాయి. మిగిలిన వాటిని కూడా వినియోగంలోకి తెస్తాం.

ప్రశ్న : ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు చర్యలేమిటి?

జవాబు : పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఆరేళ్ల లోపు వయస్సు ఉన్న బాలబాలికల కోసం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు వినియోగించుకోవచ్చు.

ప్రశ్న : పెన్షన్ల పంపిణీ రీ వెరిఫికేషన్ జరుగుతుందా ?

జవాబు : ఇద్దరు డాక్టర్లతో కూడిన రెండు బృందాలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌టీఆర్ భరోసా హెల్త్ పెన్షన్ల రీ వెరిఫికేషన్ చేస్తున్నారు. -నక్కపల్లి

పశు సంపదపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

» పశు సంవర్ధక శాఖ ఏడీ నరేశ్


పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ నరేశ్

కోటవురట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పశు సంపదపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) డాక్టర్ పి.నరేశ్ చెప్పారు. మండలంలోని టీకేపల్లి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం కోటవురట్ల పశు వైద్యశాల ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పాడి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఏడీ మాట్లాడుతూ పాడి రంగం సంరక్షణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతున్నదని చెప్పారు. ఇందులో భాగంగా ఉచితంగా పశుగ్రాసం పెంపకం చేపట్టడానికి ఉపాధి నిధులు సమకూర్చిందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి పాడి రైతుల అభివృద్ధి లక్ష్యంగా పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నదన్నారు. పెద్ద పశువులకు కూడా ఈసారి నట్టనివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేస్తున్నదన్నారు. పశు ఆరోగ్య శిబిరాల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేస్తున్నట్టు చెప్పారు. అలాగే వ్యాధి నిరోధక, నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే పశు కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 42 పశువులకు గర్భకోశ చికిత్సలు 220 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేసినట్టు ఏడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాములవాక పశు వవైద్యాధికారి హరిప్రియ, సర్పంచ్ పెట్ల లింగం నాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

పాయకరావుపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం, పెద్దూరు గ్రామాల్లో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలలో పశు వైద్యాధికారులు ఆడారి సాయిశంకర్, గుప్తా పాల్గొని పశువులను ఆరోగ్య పరీక్షలు చేశారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలలో పాల ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కోటవురట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

పల్లెపై మంచు దుప్పటి

» ఉదయం 8 గంటల వరకూ కమ్మేసిన మంచు
» ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి


నక్కపల్లి నుంచి హెటెరో రోడ్డులో పొగ మంచు


సత్యవరం గ్రామంలో కప్పేసిన పొగ మంచు

నక్కపల్లి/పాయకరావుపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏజెన్సీ ప్రాంతాలను తలపించే రీతిలో మైదాన ప్రాంతాలను పొగమంచు కమ్మేస్తోంది. నాలుగు రోజులుగా పొగమంచు ప్రభావం ఉన్నప్పటికీ, శుక్రవారం మాత్రం తీవ్ర స్థాయిలో వ్యాపించింది. ఉదయం 8 గంటల వరకూ ఎదురుగా వస్తున్న వాహనాలు 20 అడుగుల దూరంలో కూడా కనిపించనంతగా మంచు కమ్మేసింది. హైవే సహా పల్లె ప్రాంత రహదారులన్నీ మంచుముసుగులో కనిపించాయి. నక్కపల్లి, ఉపమాక, జానకయ్యపేట, సీహెచ్‌ఎల్‌పురం, పెదతీనార్ల, చిన తీనార్ల, ఎన్.నర్సాపురం,చందనాడ, వేంపాడు,అమలాపురం, కాగిత రహదారులన్నీ మంచుతో కనిపించాయి. దీంతో వాహనాలపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పాయకరావుపేట మండలంల మూడు రోజులుగా దట్టంగా పొగమంచు కురుస్తున్నది. శుక్రవారం గ్రామాలను మంచు దుప్పటి కమ్మేసింది. దీంతో వాహన చోదకులు పడరాని పాట్లు పడ్డారు. ఉదయం 9 గంటలైనా మంచు తొలగలేదు. వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నక్కపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో నక్కపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుకులం పిల్లలతో బాల్య వివాహాలకు దూరంగా వుండాలంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గురుకులం బయట కొంత మంది బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కాగా, జాతీయ బాలికా దినోత్సవానికి ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేకపోవడంతో, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు.


నక్కపల్లి గురుకుల విద్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

» డీఈవో అప్పారావునాయుడు
» పలు పాఠశాలల ఆకస్మిక తనిఖీ
» ఉపాధ్యాయులపై ఆగ్రహం



బంగారమ్మపాలెం పాఠశాలలో విద్యార్థుల పక్కన కుర్చొని మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు... విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

ఎస్. రాయవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పది పబ్లిక్ పరీక్షల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం డీఈవో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా బంగారమ్మపాలెం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులతో కలిసి కొర్చొని పుస్తకాల తీయించి చదవించారు. వారిలో పఠనా నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో కనీస ప్రతిభ కనిపించకపోవడంతో ఉపాధ్యాయులతో డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు సక్రమంగా పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి డీఈవో మధ్యాహ్నం భోజనం చేశారు.

అంతకముందు రేవుపోలవరం, కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. రేవుపోలవరంలో ముందుగా ఉపాధ్యాయులతో డీఈవో సమావేశమై పది పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తీసుకోవల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. తరువాత పది విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చక్కగా చదవుకొని, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటే చదువులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. ఈ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోవడంపై విషయాన్ని హెచ్ఎం శ్రీనివాసరావు డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలో నియమిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాలకు నూతన భవన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం కొరుప్రోలు ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులకు పది పబ్లిక్ పరీక్షలపై పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇక్కడ కూడా అప్పారావు నాయుడు మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు.

సాగుదారులకు పరిహారం ఇవ్వండి


పరిహారం ఇవ్వాలని పొలాల్లో నిరసన తెలుపుతున్న రైతులు

నక్కపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన సాగు, డీ పట్టా భూముల్లో చెట్లు, తోటలు పెంచుకుంటున్న రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని రాజయ్యపేటలోని సాగుదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కారిడార్ భూముల్లో పనులు జరిగే చోట నిరసన తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నారని, ఇప్పటివరకూ న్యాయం చేయలేదని వాపోయారు. ఈలోగా అక్కడికి చేరుకున్న పోలీసులు సమస్య వుంటే అధికారులకు తెలియజేయాలని, పనులకు అడ్డుతగలకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.మహేశ్‌బాబు, ఎం.బైరాగిరాజు, ఎం.శివాజీ, ఎం.బాపూజీ, పి.రాజు, జీ వెంకటేశ్, ఎం.నగేశ్, మానికొండమ్మ, అచ్చమ్మ, రాజు పాల్గొన్నారు.

వైసీపీకి బొడ్డేటి కాశీ రాజీనామా

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి రాజీనామా చేసినట్టు ఆపార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేటి కాశీ విశ్వనాథం (కాశీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభకు, పార్టీకి రాజీనామా చేస్తున్నానని విజయసాయిరెడ్డి ట్వీట్ చేసిన కొద్ది గంటలకే కాశీ ఈ ప్రకటన చేయడం గమనార్హం. కాశీ ప్రజారాజ్యం పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. బీచ్‌రోడ్డులో గోకార్టింగ్ ట్రాక్ ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాయిరెడ్డి ప్రతిపక్ష నాయకులను ఆర్థికంగా దెబ్బతీయడానికి యత్నించారు. ఈ క్రమంలో కాశీ గోకార్టింగ్‌ను నేలమట్టం చేశారు. దాంతో తన వ్యాపార అవసరాల కోసం కాశీ వైసీపీలో చేరిపోయారు. సాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఆయన కూడా రాజీనామా చేసేశారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి


మానవహారం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

కోటవురట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోటవురట్ల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వెలుగు కార్యాలయం నుంచి కోటవురట్ల జంక్షన్ మీదుగా స్థానిక పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితం మించి ప్రయాణికులను ఎక్కించవద్దు విన్నవించారు. అలాగే పాదచారులు రోడ్డుపై నడిచేటప్పుడు నడమ వైపు వెళ్లాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివప్రసాద్, సీసీ వల్లి సత్యవతి, సిబ్బంది సరోజని మాణిక్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల స్వైరవిహారం


వేంపాడు వీధుల్లో సంచరిస్తున్న పిచ్చి కుక్క

నక్కపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామస్థులు కుక్కల బెడదతో హడలిపోతున్నారు. వీధి కుక్కలతో పాటు పిచ్చికుక్కలు కూడా స్వైర విహారం చేస్తున్నాయని, దీనివల్ల పిల్లలను పాఠశాలలకు పంపేందుకు కూడా భయమేస్తోందని గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కుంచెమదు శుక్రవారం విలేకర్లకు చెప్పారు. పాఠశాలలకు వెళ్తున్న పిల్లలను కుక్కలు వెంబడిస్తున్నాయని, తల్లిదండ్రులు వెంట లేకపోతే పిల్లలకు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. నాలుగు రోజులుగా రెండు పిచ్చికుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తుండడంతో పెద్దలు కూడా బయటకు వెళ్లలేకపోతున్నారని చెప్పారు. పిచ్చికుక్కలను పట్టించి అటవీ ప్రాంతాల్లో విడిచి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పరవాడలో ఎనిమిదిన్నర గంటల సమయంలో దట్టంగా కురుస్తున్న మంచు

మెల్లగా తెల్లారిందో అలా..

- పరవాడ, సబ్బవరం మండలాలను కమ్ముకున్న పొగ మంచు
- ఉదయం తొమ్మిది గంటల వరకు వీడని తెరలు
- లైట్లు వేసుకుని వాహనదారులు రాకపోకలు



సబ్బవరంలో ఉదయం ఎనిమిది గంటలైనా వీడని మంచుతెరలు

పరవాడ/సబ్బవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా పరవాడ, సబ్బవరం మండలాల్లో శుక్రవారం పొగ మంచు దట్టంగా కమ్మేకుంది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు కురుస్తూనే ఉంది. కొన్నిచోట్ల ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వివిధ పనులపై బయటకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు. దీనికితోడు చలి గాలులు వీస్తుండడం మరిన్ని అవస్థలకు కారణమవుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు గజగజ వణికిపోతున్నారు. పొగ మంచు కారణంగా మామిడి, జీడిమామిడికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. పూతపై ఈ ప్రభావం చూపుతుందని అంటున్నారు. తాజా వాతావరణం కారణంగా పొలం పనులకు వెళ్లే రైతులు సైతం ఆలస్యంగా ఇంటి నుంచి బయల్దేరడం కనిపించింది.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఆలయంలో ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి తదితరుల వేదమంత్రాల నడుమ ఈ ఊంజల్ సేవను జరిపారు. వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, ఆలయ కార్యవర్గసభ్యులు, కుటుంబ సభ్యులు హాజరై నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి బృందం కోలాటాలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి. అలాగే పలు మహిళా సంఘాల సభ్యులు భక్తిగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.


గిన్నిస్ రికార్డు సాధించిన విజయ్ కుటుంబానికి సత్కారం



విజయ్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కొణతాల విజయ్ కుటుంబాన్ని ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సత్కరించారు. అనకాపల్లికి చెందిన విజయ్, అతని కుటుంబ సభ్యులు అసాధారణ నైపుణ్యంతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రస్తుతం చైనాలో నివసిస్తున్న విజయ్ కుటుంబం యోగా, క్రీడా రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారన్నారు. విజయ్ కుమార్తె జస్మిత విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విజయాలు సాధించేందుకు ముందుగా లక్ష్యం నిర్దేశించుకుని శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్‌రెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణనాగు, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'



గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

సబ్బవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయల ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని సబ్బవరం గురుకుల పాఠశాల, ఆరిపాక, నంగినారపాడు, తవ్వవానిపాలెం, కేజీబీవీ, మల్లునాయుడుపాలెం, రావలమ్మపాలెంలలో గల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లోనూ తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఏపీ టీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరావు, మండల అధ్యక్షుడు ఆర్. ప్రసాదరావు, ఉపాధ్యాయులు కె.రమేశ్‌బాబు, ఎన్.అప్పారావు, శివకుమార్, తారక్ సూరిబాబు, దత్తాత్రేయ, సత్యనారాయణ, బి.నరసింహమూర్తి తదిత రులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘ వన సమారాధన రేపు

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘ కుటుంబ సభ్యుల ఆత్మీయ వన సమారాధన ఈనెల 26వ తేదీ ఆదివారం బొజ్జన్నకొండ వద్ద జరగనుంది. ఇందుకు సంబంధించి ఆహ్వాన పత్రాలను శుక్రవారం సంఘం ప్రతినిధి ముప్పన సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులతో కుటుంబాలతో హాజరు కావాల్సిందిగా కోరారు. ప్రోగ్రామ్ కన్వీనర్ బల్లా నాగభూషణం, ముప్పన నాగేశ్వరరావు, రెడ్డి వరప్రసాద్, బూడిద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. బంగారు భవితకు చోటు

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- 'నా ఓటు- నా బాధ్యత' పేరిట అవగాహన కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఓటు.. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపనకు పునాది. ప్రజల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే సాధనం. ఉన్నతమైన పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం ప్రకారం ప్రజలకు కల్పించిన హక్కు. ఎటువంటి ప్రలోభాలకు లొంగని ఓటు నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది వేస్తుంది. ఓటు విలువ తెలపడమే కాకుండా ఓటరుకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో 'యువ ఓటర్ల సాధికారత, భవిష్యత్తుపై దృష్టి' అనే థీమ్‌తో యువత వారి ఓటు విలువను అర్థం చేసుకొని ఓటు నమోదు చేసుకోవాలన్న పిలుపుతో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

జిల్లాలోని ఓటర్ల వివరాలు ఇలా...

ఎన్నికల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రతి ఏడాది జనవరి 25న నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లాలో ఓటర్ల వివరాలను వెల్లడించింది.

జిల్లాలో 12,91,044మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 6,27,984మంది, మహిళా ఓటర్లు 6,63,032 మంది, థర్డ్ జండర్ 28 మంది ఉన్నారు. 2024 అక్టోబరు 29న ఎన్నికల కమిషన్ ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్లు 12,89,870 మంది ఉన్నారు. జిల్లాలో సర్వీసు ఓటర్లు 3,987 మది ఉన్నారు. ఎన్నికల కమిషన్ 2025 జనవరి ఆరో తేదీన ప్రకటించిన తుది జాబితా ప్రకారం జిల్లా ఓటర్లు 12,91,044 మందిగా పేర్కొన్నారు.

జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పురుష ఓటర్ల కంటే 35,045 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలో ముసాయిదా జాబితా నాటికి 16,016 మంది 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల యువ ఓటర్లు ఉండగా, ఈ ఏడాది జనవరి 6న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం 17,225 మంది యువ ఓటర్లు పెరిగారు. ఏప్రిల్, జూలై, అక్టోబరు ఒకటో తేదీల నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

అనకాపల్లిలో వివిధ కార్యక్రమాలు



జిల్లా కేంద్రం అనకాపల్లిలో శనివారం 15 జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి గుండాల వీధిలోని ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాలు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సమావేశ మందిరంలో వృద్ధ, దివ్యాంగులైన ఓటర్లకు సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నా ఓటు నా బాధ్యతపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఓటర్ల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. జిలాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

ఓటరు దినోత్సవ చరిత్ర ఇదీ...

ఎన్నికల కమిషన్ 1090 జనవరి 25న ఏర్పడింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం స్వతంత్ర్య వ్యవస్థగా ఎన్నికల సంఘం ఏర్పడింది. నిష్పక్షపాతంతో, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంటుంది. అన్నిరకాల ప్రజాస్వామ్యద్ధమైన ఎన్నికలు ఈ కమిషన్ నిర్వహించాల్సి ఉంటుంది. పార్లమెంట్, అసెంబ్లీ, పంచాయతీ, మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులను ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ఎన్నికుంటారు. చదువు రాని వారు కూడా ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల్లో పోటీచేసే ప్రతి రాజకీయ పార్టీకి ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. తొలుత ఓటరు వయోపరిమితి 21 సంవత్సరాలు ఉండేది. దీనిని 1989లో 66వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణ అప్పట్లో బ్యాలెట్ బాక్సుల ద్వారా, ప్రస్తుతం ఈవీఎంల ద్వారా జరుగుతోంది. ఓటింగ్ విధానంలో ప్రతి ఏడాది అనేక సాంకేతికపరమైన విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

గణపర్తి నుంచి ఏనుగుతుని వరకు సీసీ రోడ్డు నిర్మాణం

- పనులను ప్రారంభించిన కొణతాల రామకృష్ణ, పీలా గోవింద



శంకుస్థాపనలో కొణతాల తదితరులు

కశింకోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపర్తి నుంచి ఏనుగుతుని గ్రామం వరకు రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు సోమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం పశు ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి పాడి రైతులతో మాట్లాడారు. అలాగే, జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ అనకాపల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ఎస్పీ విస్తృత పర్యటన

- ఎన్టీఆర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన
- గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి సంబంధించి పలు సూచనలు



ఉత్సవ కమిటీ చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎస్పీ



ఎన్టీఆర్ స్టేడియంలో ఆర్డీవోతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం రాత్రి విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో షేక్ ఆయీషాతో ఏర్పాట్లపై చర్చించారు. డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకట నారాయణ, తహసీల్దార్ విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శనివారం జరగనున్న గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. ఉత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవం ప్రశాంతంగా జరిగేలా పోలీసులతో పాటు ఉత్సవ కమిటీ, ప్రజలు సహకరించాలని కోరారు. సతకంపట్టు గౌరమ్మ ఆలయ పరిసరాలు, పరమేశ్వరీపార్కు, జంక్షన్‌లలో జరిగే స్టేజి ప్రోగ్రామ్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి.అప్పారావు, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మినాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పీవీ రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, పెంటకోట జగన్, సూరిశెట్టి నర్సింగరావు, బుద్ధ భూలోకనాయుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం



మల్లునాయుడుపాలెంలో స్వామికి పూజలు

సబ్బవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మల్లునాయుడుపాలెంలో సీతారామల తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన చిడతల భజనలు, కోలాటం, నేల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. రాత్రికి పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. సర్పంచ్ బోను దేముడమ్మ, మాజీ ఎంపీపీ గండి దేముడు, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి కనకరాజు, గ్రామ పెద్దలు బోను గంగునాయుడు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి : ఐద్వా

పరవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను శుక్రవారం ఆమె ఐద్వా ప్రతినిధులతో కలిసి స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా తక్కువ ధరకే అందించాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని, ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు శ్రీదేవి, లక్ష్మి, బంగారమ్మ, ఇందుమతి, రాధ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారాయుడుపేటలో లేగదూడల ప్రదర్శన

పరవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రావాడ శివారు ధర్మారాయుడుపేటలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పరవాడ పశువైద్యశాల సహాయ సంచాలకులు కె.రామకృష్ణ, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ప్రారంభించారు. సుమారు 50కి పైగా లేగ దూడలను ఆయా రైతులు ప్రదర్శనలో ఉంచారు. వీటిలో ఆరోగ్యవంతంగా ఉన్న దూడల చెందిన రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పశువైద్యులు సురేశ్‌కుమార్, అశ్విని, స్థానిక నాయకులు వియ్యపు చిన్న, నాయుడు, కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్, మిథనాల్, ఆల్కహాల్ పట్ల అప్రమత్తత అవసరం

- ఫార్మా యాజమాన్య ప్రతినిధుల అవగాహన సదస్సులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీరామచంద్రమూర్తి



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

పరవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఔషధాల తయారీలో ఉపయోగించే ఇథనాల్, మిథనాల్ ఆల్కహాల్ పట్ల ఫార్మా యాజమాన్యాలు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. ఇక్కడి ఫార్మాసిటీలోని మ్యూచీవల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఎఎస్ఆర్ఎం) కార్యాలయంలో శుక్రవారం ఫార్మా యాజమాన్య ప్రతినిధులతో ఏర్పాట చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇథనాల్, మిథనాల్ ఆల్కహాల్‌ను పరిశ్రమల నుంచి బయటకు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాలపైనే ఉందన్నారు. ఈ ఆల్కహాల్‌ను మద్యానికి బదులుగా సేవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వీటిని అతిగా సేవిస్తే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఆల్కహాల్ బయటకు రాకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ కమిషనర్ సుజిత్‌సింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ప్రొబిహిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు, డి. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి భూములు కాపాడండి

- సాలాపువానిపాలెం రైతులు వినతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

లంకెలపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కబ్జాదారుల నుంచి తమ భూములను కాపాడాలని సాలాపువానిపాలెం రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూ బాధితుడు ఎన్.రోహిత్‌వర్మ మాట్లాడారు. తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 1/3ఏలో సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన రైతులకు 13.66 ఎకరాల జీరాయితీ భూములు ఉన్నాయన్నారు. వీటిలో 3.72 ఎకరాల భూమిని తమ కుటుంబ సభ్యులు 1983లో కొనుగోలు చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి 7.66 ఎకరాల భూమిని వాడపల్లి వెంకటరమణ పేరిట ఆన్‌లైన్ చేయించారని ఆరోపించారు. దీనిపై తాము కోర్టులో కేసు వేశామన్నారు. ఈనెల 20న కొందరు వ్యక్తులు గుంపుగా తమ స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని వివరించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆరుగురు వ్యక్తుపై పరవాడ పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే అండతోనే తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలోనే అప్పటి ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్, అదీప్‌రాజ్ అండతో రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కబ్జాదారుల నుంచి తమ భూములు కాడాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు రాజు, కృష్ణ, మనోహర్, సత్యవతి, కాంతం, సన్యాసమ్మ, పెంటమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత




తుమ్మపాలలో ర్యాలీ



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థినులు

- జాతీయ బాలికా దినోత్సవంలో వక్తలు



వెదురుపర్తిలో మాట్లాడుతున్న హెచ్ఎం మూర్తి

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలికా దినోత్సవాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలోని జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిణి కేవీ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలు మనోధైర్యాన్ని కోల్పోకూడదన్నారు. జిల్లా మహిళా, శిశుసంక్షేమ సాధికారిక అధికారిణి కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లల జననాల రేటు గతంతో పోల్చుకుంటే ఇప్పుడు బాగా తక్కువగా ఉందన్నారు. ఆడపిల్లలను కనడం అంటే ఎంతో బాధ్యతతో, ఖర్చుతో కూడుకున్న పనిగా తల్లిదండ్రులు భావిస్తున్నారన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ డైసీ మాట్లాడుతూ ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఎటువంటి సమస్య వచ్చినా దానిని అధిగమించే శక్తి సామర్థ్యాలు కలిగి ఉండాలని సూచించారు. బాలల సంరక్షణ జిల్లా అధికారి ఎం.రమేష్ మాట్లాడుతూ బాలికలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కె.సంతోష్‌కుమార్, చిన్నారావు, మంజుల, లక్ష్మి, మనోహర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు.

తుమ్మపాల : తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ రాజ్యాంగం ఆడపిల్లలకు కల్పించిన హక్కులను వారు పొందేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు మారాలని కోరారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి బాలికలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది బి.మంగమ్మ, రాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పందించే హృదయం సంస్థ వ్యవస్థాపకులు మూర్తి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారావు, సోమరాజు, రమేష్, సత్యనారాయణ, మూర్తి, విజయ్, త్రివేణి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని సీడీపీవో వి.లలితకుమారి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శుక్రవారం జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో మాట్లాడారు. బాలికలు అన్నిరంగాల్లో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం బాలికలను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదివిద్దాం, బతకనిద్దాం అంటూ నినాదాలు చేస్తూ అంతా కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే, ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మీ మాట్లాడుతూ భావి భారత నిర్మాణానికి బాలికలే వెన్నెముకగా పేర్కొన్నారు. అన్నిరంగాల్లో రాణించి తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు మచిపేరు తీరుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి ఎస్వో మృదుల, బి.లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్


కొయ్యూరు: రావణాపల్లి ఆశ్రమ పాఠశాలలో మానవహారం

బాలికల పురోభివృద్ధికి ప్రత్యేక చర్యలు: కలెక్టర్ దినేశ్‌కుమార్

» బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీలు

పాడేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలు తమ హక్కుల కోసం ఇళ్ల నుంచే పోరాటం ప్రారంభించాలన్నారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని, వాళ్లను బాలురతో సమానంగా చూడాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు చేయరాదన్నారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ... బాలికల అభివృద్ధిని కాంక్షిస్తూ 2009 నుంచి జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతున్నదన్నారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సి.జమాల్ బాషా, డీఈవో పి.బ్రహ్మాజీరావు, సీడీపీవో ఝాన్సీరాణి, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, లగిశపల్లి సర్పంచ్ ఎల్.పార్వతమ్మ, కేజీబీవీ ప్రిన్సిపల్ చంద్రకళ, టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే సమాజ పురోభివృద్ధి

చింతపల్లి: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడంతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యమని స్థాని ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో 'బేటీ బచావో బేటీ పడావో' పథకంలో భాగంగా జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. తొలుత బాలికల హక్కులు, స్వేచ్ఛపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృతం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలు స్వచ్ఛగా జీవించే వాతావరణం కల్పించాలన్నారు. అపరిచిత వ్యక్తుల పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. బాలికలు బాల్య వివాహాలు చేసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో రామలక్ష్మి, ప్రిన్సిపాల్ కె. సుమమాధురి, సైన్స్ టీచర్ వి. వరలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయ్ కుమారి, గౌహర్ ఉన్నీష, సత్యవతి పాల్గొన్నారు.



అరకులో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

సీలేరు: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీకే వీధి మండల పరిధి సీలేరులో బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి దుర్గో, ఉప సర్పంచి కె. వల్లీప్రసాద్, మహిళా పోలీసు రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యూరు మండలంలో..

కొయ్యూరు: మండలంలో పలు చోట్ల జాతీయ బాలకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్ వాడీ కేంద్రంలో, రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఈ సందర్భంగా పిల్లలకు చదువు ప్రాముఖ్యత, ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిగ్నేచర్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంబాబు, సీడీపీఓ విజయ కుమారి, సీఆర్‌పీ భాను, తదితరులు పాల్గొన్నారు.

బాలికల పట్ల వివక్షత తగదు

డుంబ్రిగుడ: సమాజంలో బాలికల పట్ల వివక్ష చూపరాదని ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని జామగుడ లో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో మానవహారం నిర్వహించారు. డుంబ్రిగుడ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యాక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి చినగెన్ను, హెచ్‌ఎం అప్పలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లక్ష్మీలావణ్య మాట్లాడుతూ.. చిన్నతనంలోని వివాహాలు చేసుకుని, జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఝాన్సీ లక్ష్మి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

గూడెంకొత్తవీధి: ఆడపిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం అద్దరవీధి బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు, సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని, రామలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మస్థైరం అవసరం

అరకులోయ: విద్యార్థినులు మానసికంగా, శరీరకంగా స్థిరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగం కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్‌నాయక్ అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం బాలికా దినోత్సవం నిర్వహించారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు, పోలీసులు

చింతపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రక్తదానానికి యువత ముందుకురావాలని స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి జి.ప్రభావతి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో విశాఖపట్నం రెడ్ క్రాస్ సొసైటీ, ఏహెచ్ వైద్యులు సంయుక్తంగా ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువకులు, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది రక్తదానం చేశారు. శిబిరంలో 90యూనిట్లు సేకరించారు. ఈ సందర్భంగా ఏహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఆరోగ్యవంతులైన యువతీ, యువకులు ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు అప్పలసూరి, వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు సాయికృష్ణ, రమేశ్, మణిదీప్, లావణ్య, భారతి, ఇందిరప్రియాంక పాల్గొన్నారు.

వైద్య సేవలపై తనిఖీలు


మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలిస్తున్న ప్రతినిధులు

డుంబ్రిగుడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ పరిధి కండ్రుం పంచాయతీ కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ బృందం ఆకస్మిక తనిఖీ చేసిం ది. డీ పీహెచ్ఎన్‌వో భులోకమ్మ నేతృత్వంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో సందర్శించింది. అనంతరం ఇంటింటికీ వెళ్లి గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వాలు కల్పించి వైద్య పరీక్షల కార్డులను పరిశీలించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కౌరమ దశ బాలికలు పాఠశాలకు ఎంత మంది విద్యార్థులు ఎంతమంది వెళ్తున్నారు.. ఇళ్లలో ఉంటున్న వారేవరు అన్న అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో కైలాశ్, డీపీవో సతీశ్, డేటా మేనేజర్ సంపత్‌కుమార్, వైద్యాధికారి రాంబాబు, వైద్య సిబ్బందిపాల్గొన్నారు.

కూటమి సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'


టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న కిడారి శ్రావణ్ కుమార్

పెదబయలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జీసీసీ ఛైర్మన్ పదవి స్వీకరించిన తరువాత తొలిసారిగా పెదబయలు వచ్చిన మాజీ మంత్రి, టీడీపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్‌కు పార్టీ శ్రేణులు,అభిమానులు,జీసీసీ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దా రెల సర్పంచ్ పాండురంగ స్వామి, త్రీనాథ్, సాగర సుబ్బరావు, రామారావు పాల్గొన్నారు.

సంచార వైద్య సేవలు ప్రారంభం

పాడేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచార వైద్య సేవలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ కోరారు. ఏపీ మైనింగ్ కార్పొరేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏర్పాటు చేసిన మొబైల్ మెడికల్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. మైనింగ్ కార్పొరేషన్ సమకూర్చిన మొబైల్ మెడికల్ యూనిట్ నెలలో 24 రోజులు ఎంపిక చేసిన ప్రదేశాల్లో భవ్య హెల్త్ సర్వీసెస్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ మొబైల్ యూనిట్‌లో డాక్టర్, ఎల్‌టీతో పాటుమరో ముగ్గురు సిబ్బంది ఉంటారన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ శార్యమన్‌పటేల్, డీఈవో సి.జమాల్‌బాషా, జిల్లాఆస్పత్రుల సమన్వకర్త కృష్ణారావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు, మైనింగ్‌కార్పొరేషన్, హెల్త్ సర్వీసెస్‌సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రవాణా శాఖాధికారి లీలాప్రసాద్

పాడేరురూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతో ప్రమాదాలను నిరోధించవచ్చునని జిల్లా రవాణా శాఖాధికారి ఎస్.లీలాప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ కూడలిలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతం అంబేడ్కర్ కూడలి నుంచి తలారిసింగ్ జంక్షన్ వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఆఫీసర్ కోడివాసు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.శ్యామ్ ప్రభు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం


మేకలకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి రాజశేఖర్

గూడెంకొత్తవీధి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా పశువులకు వైద్య సేవలందిస్తున్నట్టు స్థానిక పశువైద్యాధికారి యు. రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోప్రత్యేక పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 110 పశువులకు చికిత్స అందించారు. అలాగే, 90 పశువులు, 20 పెయ్యలు, 70 గొర్రెలు, మేకల కు గర్భకోశ నివారణ, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్జున్ వెంకట, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల పిల్లలకు ఉపాధి: ఎస్పీ



సరళ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరురూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టు దళ, మిలీషియా సభ్యుల పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్టు ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. శుక్రవారం ఆయన అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) కె.ధీరజ్‌తో కలిసి సరళ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పోలీసుల ఎదుట లొంగిపోయిన జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన మావోయిస్టు దళ, మిలీషియా సభ్యులకు చెందిన పదో తరగతి ఆపై విద్యను అభ్యసించిన 42 మంది పిల్లలతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రశాంతి ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూషన్స్ అధ్యాపకులతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు.కెరీర్‌గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. వారివారి విద్యార్హతల ఆధారంగా వివిధ ప్రైవేటు సెక్టార్ కంపెనీలలో, సంస్థలలో ఉద్యోగ కల్పనకు తగుచర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ ఈసందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పాడేరు సీఐ డి.దీనబంధు, స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ వి.రుషికేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హమాలీల ఆందోళన


నిరసన తెలుపుతున్న హమాలీలు

గూడెంకొత్తవీధి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జీసీసీ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని సంఘం మండల ప్రధాన కార్యదర్శి వంతల పండుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం సమ్మెకు దిగిన హమాలీలు స్థానిక గోదాముల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ హమాలీలకు కూలి రేట్లు పెంచాలని ఆరునెలల కిందట జీసీసీ, సివిల్ సప్లై ఉన్నతాధికారులకు నోటీసులు అందజేశామన్నారు. స్పందించకపోవడం సమ్మె చేపడుతున్నట్టు చెప్పారు. ఇకనైనా చర్చలు జరిపి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

హమాలీలను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

చింతపల్లి: హమాలీలను నాల్గోవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం నాయకుడు అవగడ్డ సత్తిబాబు అన్నారు. శుక్రవారం బంద్ పాటిస్తున్న హమాలీలు జీసీసీ గోదాం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సంఘం నాయకుడు మాట్లాడుతూ పెంచిన కూలి 12నెలలుగా అందజేయడం లేదన్నారు. యూనిఫారాలు ఇవ్వలేదన్నారు.

నర్సీపట్నం- గుమ్మిరేవుల మార్గంలో ప్రయాణ కష్టాలు

» ఈ రూటులో ఆర్టీసీ బస్సు సర్వీసు నిలిపివేత
» మూడునెలలుగా పలు గిరిజన గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు


నర్సీపట్నం గుమ్మిరేవుల బస్సు (ఫైల్‌ఫొటో)

సీలేరు, జనవరి 24, (ఆంధ్రజ్యోతి):నర్సీపట్నం గుమ్మిరేవుల ఆర్టీసీ బస్సు సర్వీసు నిలిపివేయడంతో ధారకొండ, గుమ్మిరేవుల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. జీకే వీధి మండలం మారుమూల పంచాయతీ అయిన గుమ్మిరేవులకు నర్సీపట్నం నుంచి పల్లె వెలుగు బస్సు నడిచేది. ఈ బస్సు నర్సీపట్నంలో రోజూ తెల్లవారుజామున నాలుగున్నరకు బయలుదేరి లంబసింగి, లోతుగెడ్డ జంక్షన్, చింతపల్లి, జీకేవీధి, సప్పర్ల, ధారకొండ మీ దుగా గుమ్మిరేవులకు ఉదయం తొమ్మిదిన్నర గం టలకు చేరేది. ఈ సర్వీసువల్ల జీకేవీధి, సప్పర్ల, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగులకు ఎంతో అను కూలంగా ఉండేది. అలాగే, గుమ్మిరేవులకు ఇది ఒక్కటే బస్సు సర్వీసు కావడంతో ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో పలు గ్రామాలగిరిజనులకు రాకపోకలు సాగిస్తుండేవారు.తూర్పుగోదావరి జిల్లాలోని పాతకోట, గుర్తేడు, తదితర ప్రాంతాల ప్రజలు ధారకొండ, సీలేరు, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ బస్సు ఉపయోగకరంగా ఉండేది. అయితే గత ఏడాది సెప్టెంబరు 8న ఈ ప్రాంతంలోసంభవించిన భారీ తుఫాన్‌కు మాది మళ్ల వంతెన అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోవడం, అక్కడక్కడ కల్వర్టులు దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే, జీకేవీ .ది సీలేరు ప్రధాన రహదారిలోనూ కల్వర్టులు దెబ్బతినడం, ప్రధాన రహదారిపై కొండచరియలు విరిగి పడటంతో నెల రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం ధారకొండ గుమ్మిరేవుల రహదారిని పునరుద్ధరించినా, ఆర్టీసీ బస్సును నేటికీ తిరిగి నడపలేదు. ఫలితంగా గుమ్మిరేవుల ప్రాంతం నుంచి ధారకొండకు ప్రైవే టు జీపులు, ఆటోలపై అధిక చార్జీలు చెల్లించి రావాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం డిపో ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి

» టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గిడ్డి ఈశ్వరి, నాయకులు

చింతపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లిందని పాడేరు టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి విమర్శించారు. శుక్రవారం లోతుగెడ్డ పంచాయతీ సర్పంచ్ చింతర్ల సునీల్ అధ్యక్షతన కొత్తపాలెంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రూ.20లక్షల నిధులతో చౌడుపల్లి చెరువు అభివృద్ధి, కమ్యూనిటీ భవనం, సీసీ రోడ్లు నిర్మాణాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అస్తవ్యస్తంగానున్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులను దారిమళ్లించి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారరు. ప్రస్తుతం ముఖ్యమం త్రి చంద్రబాబు సూచనలతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకొచ్చారన్నారు. సర్పంచ్‌లు ప్రస్తుతం ప్రభుత్వంవిడుదల చేసిన నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. వైసీపీ మాయలోపడిన ఆదివాసీలు ఇప్పుడిప్పుడే మేల్కొంటున్నారని, వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారన్నారు. అనంతరం పంచాయతీ వార్డు సభ్యుడు కిల్లో రామారావుతోపాటూ 20 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి ఈశ్వరి కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, సర్పంచ్ చింతర్ల సునీల్, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు పాల్గొన్నారు.

బూదరాళ్ళ పంచాయతీని విభజించాలని వినతి


కలెక్టర్‌కు వినతి పత్రంను అందజేస్తున్న దృశ్యం

కొయ్యూరు, జనవరి 24, (ఆంధ్రజ్యోతి):కొయ్యూరు మండలంలోని బూదరాళ్ళ మేజర్ పంచాయతీ పరిధిలో నూతనంగా మూడు పంచాయతీ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిపాలన సౌలభ్యంతోపాటుప్రజలకు సౌకర్యవంతంగా సేవలను చేరువ చేయాలని కలెక్టర్ దినేశ్ కుమార్‌కు స్థానిక సర్పంచ్, ముత్యాలమ్మ కోరారు. శుక్రవారం పాడేరులో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బూధరాళ్ళ పంచాయతీ మండలంలో అతి మూరుమూల ప్రాంతమని, ఈ పంచాయతీ పరిధిలో 36 గ్రామాలు, 8 వేల జనాభా విస్తీర్ణం పరం గా చూసుకుంటే దేశంలోనే అతి పెద్దదని తెలిపారు. దీని వల్ల కుగ్రామాలు అభివృద్ధికి నోచుకోక , పంచాయతీ కేంద్రం నుంచి గ్రామాలకు 50 కిలోమీటర్లు పైగా వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యార్థం పంచాయతీ పరిధిలో నిబాలరేవుల,పోకలపాలెం,గరిమండ గాకనమాలను పంచాయతీ కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు సంజీవ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలి: సీపీఐ


ఏఐవైఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ నేత సత్యనారాయణ

పాడేరురూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఎస్సీ, పోలీస్, గ్రూప్స్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ డిమాండ్ చేశారు. పాడేరులో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రథమ మహాసభలను ఆయనతో పాటు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఐటీడీఏ ద్వారా స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేవారన్నారు. అలాగే, రాజ్యాంగం షెడ్యూల్ 5, 6 ప్రకారం గిరిజనులకు ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించా ల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంనిరుద్యోగ భృతిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాము, లక్ష్మణ్‌లతోపాటు 11 మంది సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, అమర్, రాధాకృష్ణ, రాజుబాబు, సీపీఐ మండల కార్యదర్శి చంటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు ప్రచారం

పాడేరురూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు తెలుపుతుందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ తెలిపారు. పీఆర్‌టీయూ, మిత్ర సంఘాలు బలపర్చిన శ్రీనివాసులు నాయుడు విజయానికి శుక్రవారం పాడేరు మండలంలో విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టారు. తలారిసింగి, లోచలిపుట్టు, శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయ ఓరియంటేషన్ శిక్షణ తరగతుల వద్దకు ఎమ్మెల్సీ అభ్యర్థితో కలిసి వెళ్లి ప్రచారం సాగించారు. అనంతరం శ్రీనివాసులు నాయుడు మద్దతుదారులతో గుత్తులపుట్టు పాఠశాలకు వెళ్లారు. ఈ ప్రచారంలో పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, కె.రామారావు, నీలకంఠం, శోభన్‌బాబు, దేముళ్లనాయుడు, అప్పలరాజు, అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో విద్యార్థులకు తీరిన కష్టాలు


పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహర్షసాయి

ముంచంగిపుట్టు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ వందనాపల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలకు కలెక్టర్ దినేశ్‌కుమార్ చొరవతో భవన సమస్య తీరింది. పక్కా భవనం లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దినేశ్‌కుమార్ దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ రూ. 2 లక్షలు స్పెషల్ గ్రాంట్ కింద మంజూరు చేశారు. వీటికితోడు విద్యార్థుల తల్లిదండ్రులు శ్రమదానం చేసి భవన నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఈ భవనాన్ని ఎంపీడీవో శ్రీహర్షసాయి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కృష్ణారావు, రత్నకుమార్‌లు, హెచ్‌ఎం నూకరాజు, వైసీపీ నేతలు జేవీవీఎస్ మూర్తి, ఎ.జగబంధు, పద్మారావు, కొండలరావు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల ఎదుట నిరసన

డుంబ్రిగుడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఏకలవ్య విద్యాలయానికి భూములు ఇచ్చిన గిరిజనులు రెండో రోజైన శుక్రవారం నిరసన కొనసాగించారు. గిరిజనులు పాఠశాల కోసం సాగు భూములను ఇచ్చినా అధికారులు న్యాయం చేయలేదని ఆరోపిస్తూ వంటవార్పులతోపాటు టెంట్‌ను వేసి ఆందోళనను కొనసాగిస్తున్నారు. విద్యాలయంతో ఉపాధి కల్పించేంత వరకు నిరసనను కొనసాగిస్తామని బాధిత గిరిజనడు డోంబు హెచ్చరించారు.

ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం

చింతపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గృహం వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం ఎఫ్ఏ, టీఏలతోసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఏపీవో రాజు పాల్గొన్నారు.

26న బాల వినాయక దేవాలయం తీర్థ మహోత్సవం



తీర్థ మహోత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న విజయ్

నర్సీపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాల వినాయక దేవాలయం వద్ద ఈ నెల 26న నిర్వహించే 55వ తీర్థ మహోత్సవం కరపత్రాలను టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాలయ విజయ్ శుక్రవారం విడుదల చేశారు. ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటలు వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన, గజ్జాలమ్మ కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం డాన్స్ బేబీ డాన్స్, బుర్రకథ, దాండియా ప్రదర్శన ఏర్పాటు చేశామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

నర్సీపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ గోవిందరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన నమూనా పరీక్షలో ప్రతిభ కనబర్చిన 19 మందికి శుక్రవారం బహుమలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై అవగాహన అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాదవిలత, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.రమణ, జి.గౌతమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాచేరులో శివపార్వతుల విగ్రహాలు



తాచేరు కాలవ వద్ద ఏర్పాటు చేసిన శివపార్వతులు విగ్రహాలు

మాడుగుల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాడుగుల-సాగరం రహదారిలో తాచేరు వంతెన సమీపంలో శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మాడుగుల నుంచి సాగరం పాడేరు కన్వర్టు రోడ్డుకు వెళ్లేందుకు బీటీ రోడ్డుతో పాటు వంతెన నిర్మాణం చేపట్టారు. దీంతో ఇటుగా రాకపోకలు వారితో పాటు పాడేరు, అనకాపల్లి, విశాఖ ఆర్టీసీ సర్వీసులను ఇటుగా రాకపోకలు చేసేందుకు అధికారులు, నాయకులు ఆలోచన చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో నదీ ప్రవాహం ఉన్న తాచేరు కాలువ వద్ద శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన గండి చెల్లుబాబు కుమారులు మోహనరావు యోచించారు. ఈ మేరకు కోన నాగేశ్వర్రావు విగ్రహ ఏర్పాటుకు నిధులు సమకూర్చారు. దీంతో రైతులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏడాది జరిగే కార్తీకమాసం, పౌర్ణమిలో ఇక్కడికి దీపాలు వదిలేందుకు మహిళలు వస్తారు.

పశువుల సంపూర్ణ ఆరోగ్యంతోనే అధిక పాల దిగుబడి



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు

నర్సీపట్నం/గొలుగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే అధిక పాల దిగుబడి వస్తుందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) డాక్టర్ రాంబాబు చెప్పారు. నర్సీపట్నం మండలంలోని పాకలపాడు గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికపాల దిగుబడిపై రైతులకు ఏడీ అవగాహన కల్పించారు. పోషకాలు కలిగిన పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని చెప్పారు. ఈ శిబిరంలో 168 పశువులకు, 300 మేకరలకు, 45 ఆవులకు గర్భకోశ వ్యాధులపై పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. అలాగే గొలుగొండ మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పశు వైద్యులు పశువైరమేశ్, శిరీషా, పుష్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మంచుతెరలు



చోడవరంలో మంచులో కనిపించిన వాతావరణం

చోడవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీని కప్పి ఉంచే మంచుతెరలు ప్రస్తుతం మైదానాన్ని కూడా కమ్మేస్తున్నాయి. రెండు రోజులుగా మైదాన ప్రాంతంలో చలి తీవ్రత పెరగడంతో పాటు మంచు తెరలు కూడా వీడడం లేదు. తెల్లవారు జాము నుంచి మంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనదారులు లైట్లు వెలిగించుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఉంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు తొలగిపోవడం లేదు. ప్రస్తుతం మైదానంలో కూడా మంచు బాగా కురుస్తుండడం స్థానికుల్లో ఈ వాతావరణం ఆనందాన్ని నింపుతుంది.

వైసీపీకి బొడ్డేటి కాశీ రాజీనామా

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్టు ఆ పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేటి కాశీ విశ్వనాథం (కాశీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభకు, పార్టీకి రాజీనామా చేస్తున్నానని విజయసాయిరెడ్డి ట్వీట్ చేసిన కొద్ది గంటలకే కాశీ ఈ ప్రకటన చేయడం గమనార్హం. కాశీ ప్రజారాజ్యం పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. బీచ్‌రోడ్డులో గోకార్టింగ్ ట్రాక్ ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాయిరెడ్డి ప్రతిపక్ష పార్టీ నాయకులను ఆర్థికంగా దెబ్బతీయడానికి యత్నించారు. ఈ క్రమంలో కాశీ గోకార్టింగ్‌ను నేలమట్టం చేశారు. దాంతో కాశీ తన వ్యాపార అవసరాల కోసం వైసీపీలో చేరిపోయారు. ఇప్పుడు సాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఆయన కూడా రాజీనామా చేసేశారు.



ఏఎల్‌పురంలో అసంపూర్తిగా ఉన్న రెండు సచివాలయ భవనాలు



శ్లాబ్‌తో నిలిచిపోయిన ఏఎన్ఎం సబ్ సెంటర్ భవనం

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- అసంపూర్తిగా సచివాలయాలు, రైతుల భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్ర భవనాలు
- మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో దుస్థితి

కృష్ణాదేవిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పరిధిలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఈ భవనాలకు మూడేళ్ల క్రితం ప్రారంభించినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవటంతో పనులు నత్తనడక సాగాయి. ఎంతకీ బిల్లులు రాకపోవడంతో మధ్యలో వదిలేశారు. గ్రామానికి రెండు సచివాలయాలు, రైతుల భరోసా కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఒక అంగన్‌వాడీ భవనం ఇతర నిర్మాణాలకు సుమారు రూ.2 కోట్లు నిధులు



సచివాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం ఇదే..



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన రైతు సేవా కేంద్రం భవన నిర్మాణాలు

మంజూరు చేశారు. ఆ భవనాలలో ఒక రైతుభరోసా కేంద్రం పిల్లర్లకే పరిమితంకాగా మరో సచివాలయ, రైతుభరోసా కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ భవనం శ్లాబ్ వరకు నిర్మాణాలు సాగాయి. మరికొన్ని భవనాలు సగానికిపైగా పూర్తి చేసి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రెండు సచివాలయాల్లో ఉద్యోగులు సచివాలయం-1 సంబంధించిన ఉద్యోగులు పాత పంచాయతీ భవనంలోను, సచివాలయం-2 ఉద్యోగులు మూతబడిన శిథిలమైన ఎస్సీ బాలుర వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్నారు. దీనికితోడు అంగన్‌వాడీ, కమ్యూనిటీ హెల్త్ భవనం పూర్తికాక అద్దె భవనాలల్లో ఉద్యోగులు, అంగన్‌వాడీ చిన్నారులు ఉండాల్సి పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అసంపూర్తిగా భవనాలు ఉండడంతో కొంతమంది యువతకు అసాంఘిక కార్యక్రమాలు నిలయంగా మారుతున్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మాడుగుల నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

- రెండు పంటలకు రైవాడ నీరు ఇచ్చేలా అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

దేవరాపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గాన్ని మోడల్ తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం రైవాడ జలాశయం వద్ద ఎరకామ్మ గ్రామ దేవత ఆలయంలో పూజలు, రెగ్యులేటింగ్ గేట్లు వద్ద గంగ పూజ నిర్వహించారు. అనంతరం అతిథిగృహ ఆవరణలో జలాశయ చైర్మన్ పోతలపాత్రునాయుడు, రెండు నియోజకవర్గాలకు చెందిన నీటి సంఘం ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు రెండు పంటలకు నీరందించే విధంగా జలాశయాన్ని అభివృద్ధి చేసి నీటి సంఘం సభ్యులు శాశ్వతంగా పేరు ఉండేలా చూస్తానన్నారు. పోలవరం పూర్తయిన వెంటనే రైవాడ నీటిని ఆయకట్టు రైతులకు అంకితం చేస్తానన్నారు. అంతేకాకుండా ఆరు వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించే ప్రక్రియ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో ఉందన్నారు. రైవాడ జలాశయానికి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. అవసరమైన నిధులు తీసుకువచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని చెరువులకు కాకుండా పంట కాలువల పనులు కూడా జరిగే విధంగా గ్రామాల్లో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నేషనల్ లైవ్ స్టార్ పథకం కింద మేకలు, గొర్రెలు, నాటుకోళ్ల పెంపకానికి ప్రభుత్వం రాయితీపై రుణాలు ఇస్తుందన్నారు. ఈ నెల 31న దేవరాపల్లిలో జాబ్‌మేళా నిర్వహించడానికి 16 కంపెనీలు ముందుకు వచ్చాయని, మరో నాలుగు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. వీటి ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం జలాశయ చైర్మన్‌తో పాటు సంఘ అధ్యక్షలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జలాశయ డీఈఈ సత్యంనాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీకుమార్, సర్పంచ్ పెంటమ్మ, కూటమి నాయకులు పైలా ప్రసాదరావు, కిలపర్తి భాస్కరరావు, పోతల రమణమ్మ, పోతల అచ్చియ్యమ్మ, గూనూరు మల్లునాయుడు, సిహెచ్.సూర్యనారాయణ, సిహెచ్.సూర్యనారాయణ, చల్లా నానాజీ, గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, అక్కునాయుడు, అవుగడ్డ రామ్మూర్తినాయుడు, గొర్లె సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సభ్యుల ధ్వజం

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నా పట్టించుకోరా?: ఎంపీపీ జయమ్మ

అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి: ఎంపీడీవో



సమావేశంలో అధికారులకు నిలదీస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. సమస్యలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ లైన్‌మన్ నమ్మి వెంకటరావు మాట్లాడుతుండగా ఎంపీపీ జయమ్మ అడ్డుతగిలారు. గ్రామ సచివాలయాల పరిధిలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, గ్రామస్థులకు జూనియర్ లైన్‌మెన్ సక్రమంగా అందుబాటులో లేరని ఏఈని నిలదీశారు. ఎంపీడీవో కలుగజేసుకొని ప్రతీ సచివాలయాన్ని ఏఈ తనిఖీలు చేసి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ఆర్‌జీఎస్ గురించి ఏపీవో మాట్లాడుతుండగా, కొత్తజాబ్‌కార్డులు యాడింగ్ ఆలస్యం అవుతున్నందున వేగవంతం చేయించాలని జైతవరం ఎంపీటీసీ సభ్యుడు ముత్యాలనాయుడు సూచించారు అలాగే దిబ్బపాలెం నుంచి కట్టువాని అగ్రహారం వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా పనులు చేపట్టలేదని దిబ్బపాలెం ఎంపీటీసీ సభ్యుడు పెద్దినాయుడు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి వార్డెన్ మాట్లాడుతుండగా, చీడికాడ బాలికల హాస్టల్‌లో వసతి సమస్యతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నా ఎందుకు స్పందించడం లేదని సభ్యులు ప్రశ్నించారు. దీనికి ఎంపీడీవో హేమసుందర్రావు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువైద్యం గురించి వైద్యాధికారులు మాట్లాడుతుండగా, ఆవులు, గేదెలతో పాటు గొర్రెలు, మేకలకు కూడా వైద్యం అందించాలని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదవరలక్ష్మి, వైస్ ఎంపీపీ కిముదు చిన్నమ్మలు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చోడవరంలో కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న అమర్, పక్కన బూడి, ధర్మశ్రీ

చోడవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్టీలో అందరి ఆమోదంతోనే చోడవరం నుంచి పనిచేయాలని వచ్చానని, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ ప్రకటించారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో చోడవరం ఇన్‌చార్జిగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో రాజకీయాలు చేయాలన్నది తన కోరిక అని, అందుకు తగినట్టుగా చోడవరం నుంచి బరిలో దిగే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. పార్టీలో నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ నాలుగేళ్ల నియోజకవర్గంలో పనిచేస్తానన్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి నియోజకవర్గంలోని నాలుగు మండలాల కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అందరినీ కలుస్తానని ఆయన తెలిపారు. వలంటీర్ల నమ్ముకుని కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడం వల్లే పార్టీకి నష్టం వాటిల్లిందని, ఈసారి పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అంతకు ముందు జిల్లా వైసీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీలు మాట్లాడుతూ పార్టీ అధినేత అందరితో చర్చించి అమర్‌ను చోడవరంనుంచి బరిలో దించుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, చిక్కాల రామచంద్రరావు. వీసం రామకృష్ణ, నాయకులు పుల్లేటి వెంకటేశ్, ఏడువాక సత్యారావు, కె.డేవిడ్, డీవీఆర్, ఎస్.సిమ్మునాయుడు, బి.సూర్యనారాయణ, నెహ్రూ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణతకు కృషి

రోలుగుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కుసర్లపూడి జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు విద్యారుథల ఇళ్ల బాట పట్టారు. రాత్రివేళల్లో విద్యార్థుల ఇళ్లను సందర్శించి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గురువారం రాత్రి హెచ్ఎం మోహన్‌రావుతో పాటు ఉపాధ్యాయులు అప్పన రాంబాబు, శ్రీనివాసరావు, విద్యావతి, నానిబాబు పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. అలాగే ఉదయం, సాయంత్రం పాఠశాలలో కూడా ప్రత్యేక స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా తర్ఫీదు ఇచ్చి, గత ఏడాది కన్నా ఈ ఏడాదిమరింత ఉత్తీర్ణత సాధిస్తామని ఈ సందర్భంగా హెచ్ఎం మోహన్‌రావు తెలిపారు.

హైస్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

కె.కోటపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం ప్రహరీగోడ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ జరిగింది. రూ.38.4 లక్షలతో ఈ గోడను నిర్మించనున్నారు. మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీ నరసింహమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు ఎర్రినాయుడు, మండల మురళీకృష్ణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని హమాలీల ధర్నా



ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

రావికమతం/మాడుగుల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూలి రేట్లు పెంచాలన్న డిమాండ్‌తో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద శుక్రవారం హమాలీలు ధర్నా చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రావికమతం, మాడుగుల స్టాక్ పాయింట్‌లకు వచ్చిన రేషన్ బియ్యం దిగుమతిని నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు గండెం సత్తిబాబు మాట్లాడుతూ ఇంతవరకు క్వింటాకు రూ.8 మాత్రమే ప్రభుత్వం ఇస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ఈ డబ్బులు చాలక కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. కూలి రేట్లు పెంచాలని గత ప్రభుత్వం హయంలోనే ఆందోళన చేయగా పెంచుతామని జీవో ఇచ్చి రెండేళ్లయినా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఆ జీవోను అమలు చేయాలని, లేనిపక్షంలో పనుల్లో పాల్గొనబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ముమ్మిన రామకృష్ణ, పెంటకోట సత్తిబాబు, వై.అప్పారావు, ఎలమంచిలి అప్పారావు, మామిడి కొండలరావు, పెరుమాళ్ల కృష్ణారావు, అప్పలరాజు, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు రేపు

మాకవరపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపాలెం గ్రామంలో ఆదివారం నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు బూరుగుపాలెం సర్పంచ్ రమణ తెలిపారు. పరదేశమ్మ పండగ సందర్భంగా ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. టోర్నీలో పాల్గొనేవారు 26వ తేదీ ఉదయం 10 గంటలలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందిస్తామన్నారు. పేర్ల నమోదు కోసం 7330874640, 8466080449, 7032418341 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు ఎల్‌బీ.పట్నంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు

చీడికాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ.పట్నం గ్రామంలో శనివారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామని గ్రామ ఉప సర్పంచ్ కురచా నారాయణమూర్తి శుక్రవారం విలేకరులకు తెలిపారు. శ్రీమరిడిమాంబ అమ్మవారి తీర్థం పురస్కరించుకొని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారన్నారు.

మాడుగులలో జనరిక్ మందుల దుకాణం ప్రారంభం

కె.కోటపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనరిక్ మందుల దుకాణాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ డెవలప్‌మెంట్, కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక భూమి సర్వే

రోలుగుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసర్లపూడిలో ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక భూమిని శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు పచ్చిగొళ్ల ఈశ్వరరావు, మరికొంత మంది గ్రామస్థులు కలిసి గత నెల రెవెన్యూ సదస్సులో శ్మశాన వాటిక భూమిని ఆక్రమించారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని భూమి స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మండల సర్వేయర్ ఆర్‌టీ నాయుడు, గ్రామ సర్వేయర్ మహేశ్, ఇతర రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. వాస్తవంగా శ్మశాన వాటిక భూమి ఎంత, ఆక్రమణకు గురైంది ఎంత అనేది పరిశీలించామని, ఈ నివేదికను తహసీల్దార్‌కు అందజేసి తదుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటారని సర్వేయర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పచ్చిగొళ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి ముందుకురావాలి

చీడికాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించడానికి ఉపాధ్యాయులు, విద్యావంతులు, అంగన్‌వాడీ సిబ్బంది ముందుకురావాలని మాడుగుల ఐసీడీఎస్ పీవో సిహెచ్.శ్రీదేవి కోరారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా తురువోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాచారాలు, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థినులు, అంగన్‌వాడీ సిబ్బందితో బాల్యవివాహాలు నిరోధించాలని ప్రతిజ్ఞ చేశారు. అలాగే అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రమణి, మహిళా పోలీసు గొటివాడ సుజాత, ఏఎన్ఎం పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ గోవిందమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

రావికమతం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వర్క్‌షాపు వద్ద శుక్రవారం ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. శ్లాబు మెటీరియల్ తరలించే ఓ ట్రాక్టర్ ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన వర్క్ షాపు వద్ద నిలిపారు. మరుపాక నుంచి రావికమతం మెయిన్ రోడ్డులో వస్తున్న కారు, ఆగివున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొటింది. అనంతరం కారును అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. కారు ముందు భాగం ధ్వంసమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

గౌరీపరమేశ్వరుల తీర్థ మహోత్సవం

రోలుగుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరులో శుక్రవారం గౌరీపరమేశ్వరుల తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐటీడీపీ మండల ఇన్‌చార్జి బంటు రాజు, మాజీ సర్పంచ్ కోలిపల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గౌరీపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అల్లాడ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

నాతవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అల్లాడ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సురేశ్ చేస్తున్న సేవలు అభినందనీయమని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. హైస్కూల్ విద్యార్థులకు ట్రస్టు అందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు ఉంటారని, వారికి సాయపడడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత వూడి చక్రవర్తి, పారిశ్రామికవేత్త వి.వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికతో పదింతల ఫలితం

పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచనలు

ఇప్పటి నుంచే సాధన చేస్తే మేలు

మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు



విద్యార్థి జీవితానికి తొలి విజయ సోపానం పదోతరగతి. ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు ఇక్కడే బాటలు వేసుకోవాల్సి ఉంటుంది. మంచి మార్కులు పొందేందుకు ప్రణాళికాబద్ధ సాధన అవసరం. ఇందుకోసం నిపుణుల సలహాలు, సూచనలు పాటించడంతో పాటు, రోజులో ఎన్ని గంటలు చదువుకు కేటాయించాలో కూడా నిర్దేశించుకోవాలి. చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని తెలుసుకుని, అందుకు తగిన విధంగా టైం టేబుల్ రూపొందించుకోవాలి. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిపుణులు ఇస్తున్న సూచనలివి.. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

తెలుగు చాలా సులువు



తెలుగులో మూడు విభాగాలపై అంశాలుంటాయి. అవగాహన-ప్రతిస్పందనకు 32, వ్యక్తీకరణ-సృజనాత్మకతకు 36, భాషాంశాలకు 32 మార్కులుంటాయి. పద్య పాఠ్యాంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి రెండు మార్కులు. రెండో ప్రశ్న పరిచిత గద్యభాగం, మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి నాలుగు వాక్యాలిచ్చి ఏ కాండమునకు చెందినవో రాయాలి. నాలుగో ప్రశ్నగా కరపత్రం, లేఖ ఏదో ఒక అంశం ఇచ్చి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వ్యక్తీకరణ-సృజనాత్మకత భాగంలో 5,6,7 ప్రశ్నలు అన్నీ రాయాలి. కవి పరిచయం, పద్య పాఠ్యాంశాలు చదవాలి. 6,7వ ప్రశ్నలకు పరిచయం, కథనం, వ్యాసం, నాటకం, నేపథ్యం ఉంటుంది. 8,9,10 వ్యాస రూప ప్రశ్నలు. 11 నుంచి 19 వరకూ 2 మార్కుల ప్రశ్నలు (శబ్ద, అర్థాలంకాలు, ఛందస్సు, జాతీయాలు ఉంటాయి. వాటితో పాటు సంధులు, సమాసాలు, వాక్యాలపై నిరంతర సాధన అవసరం.

- వీవీ రమాకుమారి, తెలుగు ఉపాధ్యాయిని

అధికమార్కులిచ్చే హిందీ



ఇందులో ఆరు విభాగాలుంటాయి. భాషీకీబాత్ 12, అర్థ్‌గ్రాహ్యత్, ప్రతి ప్రక్రియ, కవుల జీవిత చరిత్ర 8, ఉపవాచకం 24, పద్య, గద్య భాగాలు 20, ఆరో భాగంలో 16 మార్కులు. హిందీతో సులువుగా మార్కులను సాధించవచ్చు. వ్యాకరణాంశాలకు సంబంధించి జవాబులు ప్రశ్నపత్రంలోనే ఉంటాయి. వాటిని గుర్తించాలి. పద్య, గద్య భాగాలకు రెండు పేరాగ్రాఫ్‌లుంటాయి. అర్థం చేసుకొంటే సులువుగా జవాబులు రాయవచ్చు. కవి పరిచయం, కబీర్‌కు సంబందించిన ప్రశ్నలు, పద్యభాగానికి సంబంధించి వ్యాస రూప ప్రశ్న, లేఖ రాయాల్సి ఉంటుంది. విహారయాత్ర, పుస్తక్ ఖరీదేనా, హిందీ సికనేకీ ఆవశ్యకత్‌లలో వచ్చే అవకాశముంది.

- ఎ.భానుమతి, హిందీ ఉపాధ్యాయిని

ఆంగ్లంపై ఆందోళన వద్దు



పేపరు మూడు భాగాలుగా ఉంటుంది. సెక్షన్-ఏలో రీడింగ్ కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 మార్కులు బహుళైచ్ఛిక ప్రశ్నలు, ఆరు మార్కులు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. 1 నుంచి 15,16,17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్-బీలో ఒకాబులరీ, గ్రామర్‌కు 40 మార్కులు. మొత్తం పాఠ్యాంశాలు బాగా చదివితే మంచి 18 నుంచి 34 వరకూ ప్రశ్నలకు సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్-సి 30 మార్కుల్లో 35వ ప్రశ్న డైరీ రైటింగ్, 36వ ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరాగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటీవ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలు సాధన చేయాలి. - ఆర్.నరసింగరావు, ఇంగ్లీషు ఉపాధ్యాయులు

సాంఘికశాస్త్రంలో భావనలే కీలకం



ఇందులో 33 ప్రశ్నలు,4 సెక్షన్లు ఉంటాయి. జాగ్రఫీ, చరిత్ర, పౌరశాస్త్రం, ఆర్థికశాస్త్రం ప్రశ్నలకు 23 చొప్పున మార్కులు. మ్యాప్ పాయింటింగ్‌కు 8 మార్కులు. విద్యార్థులు 4,8 ప్రశ్న లు రాసేటప్పుడు విధిగా సైడ్ హెడ్డింగ్‌లు పెట్టాలి. పాయింట్ల రూపంలో జవాబులు రాస్తూ, ప్రధాన విషయమైతే అండర్‌లైన్ చేయాలి. చేతిరాత ఆకర్షణగా ఉండాలి. మ్యాపు గుర్తింపు అభ్యసనం బాగా చేస్తే సులువుగా గుర్తించవచ్చు. సమాచార నైపుణ్యాల ప్రశ్నలు పట్టిక రూపంలో, గ్రాఫ్ రూపంలో ప్రశ్నలు ఇస్తారు. సులువుగా సమాధానాలు రాయవచ్చు. - ఎం.ప్రభాకరరావు, సోషల్ ఉపాధ్యాయులు

సూత్రాలపై పట్టుండాలి



మాథ్స్‌లో నాలుగు సెక్షన్లుంటాయి. సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులుంటాయి. నిర్వచనాలు, సూత్రాలు, నిర్మాణాలు సాధన చేయాలి. తరచూ లెక్కలు చేస్తుండాలి. వాస్తవ సంఖ్యలు, నిరూపక రేఖా గణితం, రేఖీయ సమీకరణాల పై అవగాహన అవసరం. శ్రేడులు,సాంఖ్యక శాస్త్రం, సంభావ్యతను తరచూ చూడాలి. త్రికోణమితిలో ప్రతి లెక్కను బొమ్మలతో వివరిస్తే మంచి మార్కులు వస్తాయి. ప్రతిలెక్కకూ సూత్రాలను అన్వయించాలి. 1,2 మార్కులకు సూత్రాలు ప్రతి రోజూ చదవాలి. గ్రాఫ్ లెక్కలు గుర్తుంచుకొని జాగ్రత్తలు పాటించాలి. జవాబు పత్రంలో కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.

- కె.నాగజ్యోతి, లెక్కలు ఉపాధ్యాయిని

భౌతిక శాస్త్రం బహు సులభం



ఇది 50 మార్కుల పేపర్. 17 ప్రశ్నలు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒక మార్కు ప్రశ్నలు 8, రెండు మార్కుల ప్రశ్నలు 3, నాలుగు మార్కుల ప్రశ్నలు 3 ఉంటాయి.(వీటికి ఛాయిస్ లేదు.) 12వ ప్రశ్న డయాగ్రామ్‌కు ఛాయిస్ ఉంటుంది. 8 మార్కుల ప్రశ్నకు అంతర్గత ఛాయిస్ ఉంటుంది. హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి లోపాల సవరణ, బాష్పీభవనం, మరుగుటకు భేదాలు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, ఎండమావులు, విద్యుత్ మోటారు ఏసీ,డీసీ, జనరేటర్ పనిచేసే విధానం, క్వాంటం సంఖ్యలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణాలు, ఆమ్లాలు, క్షారాలు, పరమాణు నిర్మాణం, లోహసంగ్రహణ శాస్త్రంపై పట్టుండాలి. ఘన పదార్థపు విశిష్ట ఉష్ణం కనుగొనుట, సాఖ్యాంతరం, గాజుల దిమ్మె, వక్రీభవన గుణకాలు, ఆమ్ల రసాయన చర్యలు చదవాలి.

- దండు శ్రీనివాసరావు, ఫిజిక్స్ ఉపాధ్యాయులు

పాఠ్యపుస్తకం బాగా చదవాలి



జీవశాస్త్రం 50మార్కుల పేపర్ 2.సెక్షన్-1లో ఒక మార్కు ప్రశ్నలు 6, 2లో రెండుమార్కుల ప్రశ్నలు 4, 3లో నాలుగు మార్కుల ప్రశ్నలు, 4లో ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2. 1,2 సెక్షనల్లో ఐచ్ఛిక ప్రశ్నలుండవు.మూడో సెక్షన్లో 12వ ప్రశ్నకు ఐచ్ఛికం ఉంటుంది. 4వ సెక్షన్‌లో 16,17 ప్రశ్నలకు అంతర్గత ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. జీవక్రియలు, ప్రత్యుత్పత్తి నుంచి ప్రశ్నలుంటాయి. బొమ్మలు, ఆధారిత ప్రశ్నలు, ఫ్లోచార్టులు, ప్రయోగాలు, పట్టికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.- డి.విజయభారతి, బయాలజీ టీచర్

బెల్లం మార్కెట్‌లో అమెరికా రోటరీ క్లబ్ ప్రతినిధి

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు (బెల్లం మార్కెట్)ను అమెరికాకు చెందిన రోటరీ ప్రతినిధి బ్రెయిన్ రాలీ, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వనాథ్ శుక్రవారం సందర్శించారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం, రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను పరిశీలించారు.



బెల్లం మార్కెట్‌ను పరిశీలిస్తున్న అమెరికా రోటరీ క్లబ్ ప్రతినిధి బ్రెయిన్ రాలీ

మార్కెట్ యార్డులో బెల్లం లావాదేవీల గురించి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. వీరి వెంట రోటరీ ప్రతినిధులు ఆర్ఎస్ రాజేశ్వర ప్రసాద్, బుద్ధ రమణాజీ, సానా వెంకటరావు, కుమార్, సతీశ్, పీజే నాయుడు తదితరులు వున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కె.కోటపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతాడ శివారు రామచంద్రపురం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన మద్దాల శివప్రసాద్ (38) గురువారం రాత్రి చంద్రయ్యపేటలో ఒక శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా పెందుర్తి నుంచి వస్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన శివప్రసాద్‌ను కె.కోటపాడు 50 పడకల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. శివప్రసాద్‌కు భార్య అపర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మద్దాల శివప్రసాద్(ఫైల్)

త్రిశంకు స్వర్గంలో తాండవ షుగర్స్

... 5వ పేజీ తరువాయి

చక్కెర కర్మాగారాలపై అధ్యయనం పేరుతో క్యాబినెట్ సబ్ కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు తప్ప ఎటువంటి సాయం అందజేయలేదు. మరోవైపు చెరకు మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడం, ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు డబ్బులను ఆలస్యంగా ఇస్తుండడంతో రైతులు క్రమేపీ చెరకు సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటూ వచ్చారు. ఫ్యాక్టరీపై ఇది మరింత ప్రతికూల ప్రభావం చూపింది. ఒకప్పుడు లక్ష టన్నులకుపైగా చెరకు క్రషింగ్ చేసిన తాండవ ఫ్యాక్టరీ.. 2020-21 సీజన్‌లో 40 వేల టన్నులకు పడిపోయింది. ఫ్యాక్టరీ యంత్రాలు పాతబడిపోవడంతో పంచదార రికవరీ శాతం తగ్గిపోయి, రైతులకు ప్రోత్సాహకం అందని పరిస్థితి నెలకొంది. అప్పటికి ఫ్యాక్టరీ రూ.40 కోట్ల నష్టాలకు చేరుకుంది. మరోవైపు రైతులకు రూ.11 కోట్లు, కార్మికులకు వేతన బకాయిలు రూ.10 కోట్లు చెల్లించాల్సి వుంది. ఈ సమయంలో రాష్ట్రంలో అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం.. తాండవ షుగర్స్‌ను ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో చెరకు రైతులకు బకాయిలు పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో వున్న ఫ్యాక్టరీ యాజమాన్యం 2021-22 క్రషింగ్ సీజన్ నుంచి ఫ్యాక్టరీని మూసివేసింది. రైతులు ఏడాదిన్నరపాటు ఆందోళనలు చేయగా చెరకు బకాయిల కోసం ప్రభుత్వం నిధులు ఇచ్చింది. కార్మికులకు వేతన బకాయిలు చెల్లించలేదు. బకాయిల చెల్లింపు, ఫ్యాక్టరీని తిరిగి తెరిపించడం కోసం యాజమాన్యం, కార్మికులు అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి, మంత్రులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆదుకుంటామని హామీ ఇవ్వడమే తప్ప కార్యరూపం దాల్చలేదు. తరువాత రెండేళ్లపాటు అధికారంలో వున్నప్పటికీ వైసీపీ పాలకులు మాటలతో మభ్యపెట్టారు తప్ప ఫ్యాక్టరీని తెరిపించడానికి చర్యలు చేపట్టలేదు.

ఉపాధి లేక.. బకాయిలు అందక..

ఫ్యాక్టరీలో ఫుల్ టైమ్, సీజనల్ ఎన్ఎంఆర్‌లుగా సుమారు 300 మంది కార్మికులు పనిచేసేవారు. ఫ్యాక్టరీ మూతపడడంతో వీరంతా రోడ్డున పడ్డారు. వేతన బకాయిలు, పీఎఫ్ బకాయిలు, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ వగైరా కలిపి రూ.13.5 కోట్ల వరకు వీరికి అందాల్సి వుంది. ఫ్యాక్టరీ మూతపడడంతో కుటుంబాలను పోషించుకోవడానికి భవన నిర్మాణ కార్మికులుగా, షాపులు, హోటళ్లలో వర్కర్లుగా పనులకు వెళుతున్నారు. మరోవైపు నాలుగేళ్ల నుంచి ఫ్యాక్టరీ రన్నింగ్‌లో లేకపోవడంతో యంత్రాలు తుప్పపట్టి పాడైపోతున్నాయి. ఫ్యాక్టరీని తిరిగి తెరవాలంటే చాలా వరకు యంత్రాలు, పరికరాలను మార్చాల్సి వుంటుంది. దీనిపై ఫ్యాక్టరీ ఎండీ ప్రసాదరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. కార్మికుల వేతన బకాయిల చెల్లింపు కోసం రూ.13.5 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞాపన పంపామని, చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఫ్యాక్టరీ భవిష్యత్తు ఆధారపడి వుందన్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

యువగళం పాదయాత్రలో భాగంగా 2023 డిసెంబరు రెండో వారంలో పాయకరావుపేట వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాండవ షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత కూడా లోకేశ్ పక్కనే వున్నారు. షుగర్ ఫ్యాక్టరీని వచ్చే క్రషింగ్ సీజన్ (2025-26) నాటికి అయినా తెరిపించాలని కోరుతున్నారు.

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు?

... 5వ పేజీ తరువాయి

అత్యధికులు ప్రస్తుతం వేరే ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ టౌన్ ప్లానింగ్‌లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ తమకు అందిన ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు 2022 ఆగస్టు నాలుగో తేదీన ఇక్కడ కార్యాలయంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్టు గుర్తించారు. ఇందుకు పట్టణ ప్రణాళికా విభాగం అండదండలు వున్నట్టు నిర్ధారణకు వచ్చి కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసిన అధికారులు.. తరువాత వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అయితే ఈ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నతాధికారులు కొందరిని రిలీవ్ చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో ఆయా అధికారులను గుర్తించి, ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిసింది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసిన అధికారులు, వారికి సహకరించిన సిబ్బందిపై పురపాలక శాఖ క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది.

కల్లు గీత కులాలకు మద్యం దుకాణాలు

... 5వ పేజీ తరువాయి

కేటాయించామన్నారు. అనకాపల్లి జిల్లాలో శెట్టిబలిజ, యాత, గౌడ్, గౌడ అనే నాలుగు కల్లు గీత ఉప కులాలను గుర్తించినట్టు చెప్పారు. వీరిలో శెట్టిబలిజలకు తొమ్మిది, యాతలకు నాలుగు, గౌడలకు ఒకటి, గౌడ్‌లకు ఒకటి చొప్పున మొత్తం 15 మద్యం దుకాణాలను కేటాయించామన్నారు. ఈ మేరకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని, దుకాణాల ఏర్పాటుకు (ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్/ హైబ్రిడ్‌మోడ్) ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ వుంటుందని ఆమె అన్నారు. ఫిబ్రవరి ఆరో తేదీన దరఖాస్తుల పరిశీలన, ఏడో తేదీన లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు వుంటుందని చెప్పారు.

ఏ దుకాణం.. ఏ కులానికి..

శెట్టిబలిజ కులం వారికి అనకాపల్లి రూరల్, నక్కపల్లి, నాతవరం, చీడికాడ, వి.మాడుగుల, మునగపాక, కశింకోట, రాంబిల్లి, బుచ్చెయ్యపేట కేటాయించారు. యాత కులం వారికి రోలుగుంట, పాయకరావుపేట, దేవరాపల్లి, రావికమతం; గౌడ కులం వారికి మాకవరపాలెం, గౌడ్ కులం వారికి ఎలమంచిలి కేటాయించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

వీఏఓలు పోరుబాట

» జీతాల బకాయిల కోసం 27 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు

» సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జీతాల బకాయిలపై ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపటనున్నట్టు వెలుగు వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి చెప్పారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆరు నెలల నుంచి జీతాలు అందకపోవడంతో వందలాది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులతో డిసెంబరు 16న సెర్ప్ సీఈఓ జరిపిన చర్చల్లో సంక్రాంతి పండుగ లోపు జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. దీంతో దశల వారీ ఆందోళనల్లో భాగంగా వచ్చే సోమవారం నుంచి బుధవారం వరకు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్టు చెప్పారు. ఈ నెల 31వ తేదీలోగా జీతాలు చెల్లించకపోతే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సేవలు నిలిపివేస్తానన్నారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి వీవీ ప్రసన్న, జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూపాదేవి

గవర్నర్ ఎట్‌హోమ్‌కి మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కి ఆహ్వానం

చీడికాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ దినోత్సవాల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ ఇచ్చే ఎట్‌హోమ్ విందుకు హాజరుకావాలని తనకు ఆహ్వానం అందిందని మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. విద్యా రంగంలో చేసిన కృషికి తనను ఎంపిక చేస్తూ డీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారం, అధికారుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు.



చెరకాపు వెంకటలక్ష్మి

నేడు గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

» భారీ ఎత్తున ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని పూలదండలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు తెలిపారు. శనివారం తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12.45 గంటలకు అమ్మవారి ఊరేగింపు ప్రారంభం అవుతుంది. ఉత్సవంలో సందర్భంగా చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు, రింగురోడ్డు, గవరపాలెంలోని అన్ని వీధుల్లో విద్యుత్ సెట్టింగులు, తోరణాలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం వివిధ ప్రాంతాల్లో 36 వేదికలను ఏర్పాటు చేశారు. శనివారం అర్ధరాత్రి రింగురోడ్డు జంక్షన్‌లో భారీ ఎత్తున బాణసంచా కాలుస్తారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు



చిననాలుగురోడ్ల జంక్షన్‌లో విద్యుత్ సెట్టింగ్



బాలకృష్ణ బస్టాప్ వద్ద విద్యుత్ సెట్టింగ్



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులు మళ్లింపు

గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా మెయిన్ రోడ్డు, గవరపాలెం ప్రాంతాల్లో భక్తులతో రద్దీగా వుండే అవకాశం వున్నందున ఆర్టీసీ బస్సులను వేరే మార్గాల్లో నడపనున్నట్టు డిపో ఇన్‌చార్జి మేనేజర్ రవిచంద్ర చెప్పారు. విశాఖపట్నం వైపు రాకపోకలు సాగించే బస్సులు పూడిమడక బైపాస్ నుంచి జాతీయ రహదారిపై జలగలమదుం జంక్షన్ మీదుగా మళ్లించారు. తగరపువలస, విజయనగరం వైపు నుంచి వచ్చే బస్సులు సుంకరమెట్ట జంక్షన్ వద్ద నుంచి విశాఖ వైపు మళ్లి, జలగలమదుం జంక్షన్, పూడిమడక బైపాస్ మీదుగా కాంప్లెక్స్‌కు చేరుకుంటాయి. ఇక్కడి నుంచి తగరపువలస, విజయనగరం నడిచే బస్సులు కూడా ఇదే మార్గంలో ప్రయాణిస్తాయి.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ఎస్పీ

ఇదిలావుంటే, గవరపాలెం గౌరీ పరమేశ్వరులను శుక్రవారం రాత్రి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా దర్శించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఇక్కడికి వచ్చిన ఆయన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఎస్పీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో మరో హనీ ట్రాప్ కేసు

» పోలీసుల అదుపులో మహిళ, నలుగురు పురుషులు..పరారీలో మరో ఇద్దరు

» బాధితుడు శ్రీకాకుళం జిల్లా వాసి

భీమునిపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో మరో హనీ ట్రాప్ కేసు వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో బాధితుడు శ్రీకాకుళం జిల్లావాసి. దీనిపై 22న భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందగా, శుక్రవారం బయటకు వచ్చింది. ఈ కేసులో ఓ వివాహితతో పాటు, సహకరించిన నలుగురిని శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు...

నగరంలోని కంచరపాలేనికి చెందిన వివాహిత (34), విజయనగరం కొత్త అగ్రహారానికి చెందిన డోలా లక్ష్మణ్, ఇంటి సురేష్, బంగారు చక్రధర్, నగరంలోని ఉషోదయ జంక్షన్‌కు చెందిన ములపర్తి వెంకటేష్, పెదవాల్తేరుకు చెందిన మరో ఇద్దరు ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా ఆమె ద్వారా పలువురికి ఫోన్లు చేయించి ముగ్గులోకి దింపేవారు. ఈ విధంగా ఈనెల 18న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన వెల్డర్ ఒకరికి ఫోన్ చేసి, మాయమాటలతో పడగొట్టారు.తాను 19న విశాఖ వస్తానని, కలుద్దామని ఆయన చెప్పారు. దీంతో ఆరోజు ఫోన్ చేశారు. అయితే తాను తన కుమార్తెను బోయిపాలెం వద్ద హాస్టల్‌లో డ్రాప్ చేసి వెళ్లిపోతున్నానని చెప్పడంతో, కలుద్దామనుకున్నాం కదా అలా ఎలా వెళ్లిపోతారని వివాహిత ప్రశ్నించింది. దీంతో ఆయన తగరపువలస సమీపంలోని సంగివలస మూడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద ఆటో దిగిపోతానని, అక్కడ కలుద్దామని చెప్పడంతో సరేనంది. ఆయన అక్కడ దిగి నిరీక్షిస్తుండగా మూడు బైకులపై ఆరుగురు వ్యక్తులు వెళ్లి...తమ బంధువైన మహిళకి ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నావంటూ బైక్‌పై బలవంతంగా ఎక్కించుకుని విజయనగరం వైపు తీసుకువెళ్లారు. రఘు కాలేజీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బైకులు ఆపి ఆయన్ను చితగ్గొట్టారు. జేబులో ఉన్న రూ.50 వేలు, ఏటీఎం కార్డులు తీసుకున్నారు. అతడి సెల్‌ఫోన్ నుంచి రూ.8,900 తమకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే చంపేస్తామని బెదిరించి, అతడిని అక్కడే వదిలేసి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. అప్పటికి సాయంత్రం 4.45 గంటలు అయ్యింది. ఆయన షర్టు జేబులో మిగిలిన రూ.500తో ఇంటికి వెళ్లిపోయాడు. ముఖం కమిలిపోయి, వంటినిండా దెబ్బలు ఉండడంతో కుటుంబసభ్యులు ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని వివరించాడు. ఈనెల 22న భీమిలి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విశాఖ నార్త్ క్రైమ్ సీఐబీఎస్ఎన్ ప్రకాశ్ పర్యవేక్షణలో భీమిలి ఎస్ఐ సూర్యప్రకాశరావు, ఆరు బృందాలు నిందితుల సెల్‌ఫోన్ కాల్ లిస్ట్, సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. చాకచక్యంగా నిందితులను పట్టుకుని వారి నుంచి మూడు బైకులు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులు నగరంలో మీడియాకు తెలియజేస్తారని, కేసు దర్యాప్తులో ఉందని భీమిలి ఎస్ఐ సూర్యప్రకాశరావు తెలిపారు. నగరంలో రెండు నెలల క్రితం ఓ హనీ ట్రాప్ కేసు వెలుగుచూసిన విషయం తెలిసిందే.